

ఆంజనేయస్వామి మూలవిరాట్

• భక్తుల కొంగుబంగారం పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి
• నేటి నుంచి శ్రావణమాస ఉత్సవాలు

పాహిమాం.. అంజన్నా..

6

విద్యార్థుల ఫోన్.. స్కూల్‌కి వచ్చిన ఎమ్మెల్యే

భోజనం బాగోలేదని ఎమ్మెల్యేకి పాముదుర్తి హైస్కూల్ విద్యార్థుల ఫోన్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బుక్కపట్నం, జూలై 25(ఆంధ్రజ్యోతి): 'హలో.. మేడం..! మేము పాముదుర్తి హైస్కూల్ విద్యార్థులం మాట్లాడుతున్నాం. మాకు పెడుతున్న మధ్యాహ్న భోజనం ఏమాత్రం బాగుండటం లేదు. మీరే ఒకసారి వచ్చి పరిశీలించండి' అంటూ విద్యార్థులు ఫోన్‌లో చేసిన ఫిర్యాదుకు ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి వెంటనే స్పందించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే శుక్రవారం మారాలకు వెళ్లారు. ఆ సమయంలో పాముదుర్తి ఉన్నతపాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యేకి ఫోన్ చేయడంతో ఆమె హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. భోజన నాణ్యతను పరిశీలించి ఏజెన్సీ నిర్వాహకులు, హెచ్ఎం వెంకటనరసమ్మపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ ఇంట్లో పిల్లలకు కూడా ఇలాంటి భోజనమే పెడతారా అని మండిపడ్డారు. పిల్లలు ఎంత బాధపడి ఉంటే తనకు ఫోన్ చేసి, ఫిర్యాదు చేస్తారని నిలదీశారు. ఎన్నిరోజులనుంచి ఇలా నాణ్యతలేని భోజనం పెడుతున్నారని ప్రశ్నించారు. పద్ధతి మార్చుకోకపోతే ఏజెన్సీని తొలగించి మరొకరికి అప్పగిస్తామని హెచ్చరించారు. అనంతరం ఏడో తరతగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి, వారి నైపుణ్యాన్ని పరిశీలించారు.



ఎగువతూపల్లిలో నిర్మించిన ఆర్వో ప్లాంటు



వెలగని సోలార్ వీధీ దీపం

నిధులు మింగేశారా..?

మండలంలోని ఎన్పీకుంట, పి.కొత్తపల్లి, రెవెన్యూ గ్రామాల పరిధిలో 2014లో సోలార్ పార్కు నిర్మాణం ప్రారంభించారు. భూములిచ్చిన రైతుకు పాత పట్టా ఎకరాకు రూ.3 లక్షలు, డిపట్టాలకు రూ.2 లక్షలు మేర అందించారు. నేటికీ పరిహారానికి నోచుకోని రైతులు ఉన్నట్లు రెవెన్యూ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అప్పట్లో 7,300 ఎకరాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వెయ్యి మెగా ఓల్ట్‌ల సౌర విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. పరిశ్రమలు ప్రతి ఐదేళ్లకోసారి సీఎస్ఆర్ కింద గ్రామాలకు నిధులిస్తాయి. వీటిని గ్రామాల్లో తాగునీరు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయల కల్పనకు వెచ్చించాల్సి ఉంటుంది. ఇప్పటికే మండలంలో సీఎస్ఆర్ నిధులతో రోడ్లు, సోలార్ వీధిదీపాలు, ఆలయాలు, ఆర్వో ప్లాంట్లు, భవనాలు నిర్మించారు. నాసిరకంగా నిర్మాణాలు చేపట్టి, నిధులు మింగేశారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి.

సామాజిక బాధ్యతకు తూట్లు..!



సీఎస్ఆర్ నిధులతో నాసిరకంగా పనులు

ఊరు బాగుండాలని జీవనాధారమైన భూములను రైతులు త్యాగం చేశారు. యువతకు ఉద్యోగాలు దొరికితే బతుకులు బాగుపడుతాయనుకున్నారు. వారి త్యాగాలతో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటైంది. ఆ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద భూములిచ్చిన గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులిచ్చింది. వాటితో అభివృద్ధి చేయాల్సింది పోయి, అడ్డగోలుగా దోచేశారు. కోట్ల రూపాయలతో చేపట్టిన రోడ్లు నాసిరకంగా ఉన్నాయి. మురుగు కాలువలు కూడా నిర్మించకుండానే రోడ్లు వేశారు. కాలువలు లేక మురుగు నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. పెద్దమొత్తంలో నిధులు వెచ్చించి, సోలార్ వీధిదీపాలు ఏర్పాటు చేశారు. అవికూడా పనిచేయట్లేదు. వాటి స్థానంలో కొత్తవాటినీ ఏర్పాటు చేయలేదు. వాటి కోసం ఎంత వెచ్చించారన్న వివరాలనూ అధికారులు వెల్లడించట్లేదు. తమకు సంబంధం లేదన్నట్లు తప్పించుకుంటున్నారు. ఆయా గ్రామాల ప్రజలకు శుద్ధ జలం సరఫరా చేసే ఉద్దేశంతో స్థానిక అభివృద్ధి నిధుల(ఎల్ఏడీఎఫ్)తో వాటర్ ప్లాంట్లు నిర్మించారు. ప్రారంభం కాకనే అవి దెబ్బతింటున్నాయి. నిర్మాణాలు నాసిరకంగా చేపట్టడమే ఇందుకు కారణమని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సోలార్ కంపెనీ ఇచ్చే నిధులను దిగమింగి, రైతుల త్యాగాలను అపహాస్యం చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఎన్పీకుంటలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

నంబులపూలకుంట, జూలై25(ఆంధ్రజ్యోతి): నంబులపూలకుంట, పి.కొత్తపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో రోడ్ల నిర్మాణానికి సీఎస్ఆర్ నిధులు రూ.మూడు కోట్ల చొప్పున ఇచ్చారు. మురుగు కాలువలు లేకుండానే రోడ్లు వేసి, మమ అనిపించారు. ఎగువ ప్రాంతాల్లో నివాసాల వారు మురుగునీరు రోడ్డుపైకి వదులుతుండడంతో దిగువన ఉన్నవారు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీటితో దోమలు అధికమై, వ్యాధులు

(మిగతా 6వ పేజీలో...)

ఉచిత ప్రయాణానికి సన్నాహాలు

- పాత బస్సులకు మరమ్మతులు
- బస్‌స్టేషన్లలో సౌకర్యాల కల్పన
- 100 కొత్త బస్సులకు ప్రతిపాదనలు



పుట్టపర్తి ఆర్టీసీ బస్టాండ్

పుట్టపర్తిరూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణానికి అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఆగస్టు 15న లాంఛనంగా ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఆర్టీసీ అధికారులు అన్ని ఏర్పాట్లను ముమ్మరం చేస్తున్నారు. కొత్తబస్సులకు ప్రతిపాదనలు, పాతబస్సులకు మరమ్మతులు, బస్సు స్టేషన్లలో రద్దీకి అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన తదితర పనుల్లో అధికారులు తలమునకలయ్యారు.

- జిల్లాలో బస్సు డిపోలు : 6
- మొత్తం బస్సులు : 400
- రోజుకు ప్రయాణించేవారు : 1,20,000
- మహిళా ప్రయాణికులు : 35వేల నుంచి 40వేలు
- కొత్తగా ప్రతిపాదించిన బస్సుల సంఖ్య : 100
- రోజుకు తిరిగే దూరం : 1,45,000 కిలోమీటర్లు

బస్టాండ్లలో ఉన్న మరుగుదొడ్లకు మరమ్మతులు, కూర్చోవడానికి అదనంగా బెంచీలు, విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు తదితర ఏర్పాట్లపై దృష్టి సారించినట్లు సమాచారం. ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి 80 శాతం ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలుస్తోంది.

80 బస్సులకు కొత్తరూపు

మహిళల ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన ఇతర రాష్ట్రాల్లో ముందస్తు ఏర్పాట్లు లేక తలెత్తిన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకున్న అధికారులు అందుకు తగ్గట్లుగా బస్సులను సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా చిరిగిన సీటు కవర్లు, పగిలిన కిటికీలకు మరమ్మతులు చేస్తున్నారు. జిల్లాలో రద్దీని దృష్టిలో ఉంచుకుని 60 ఎక్స్‌ప్రెస్ బస్సులను 50 మంది మహిళలు కూర్చొనే విధంగా సీటింగ్, 20 సూపర్ లగ్జరీ బస్సుల సీటింగ్ కెపాసిటీని 30 నుంచి 50 సీట్లకు మార్పులు చేస్తున్నారు. రద్దీకి అనుగుణంగా జిల్లాలోని అన్ని బస్టాండ్లలో 50 నుంచి 60 బెంచీలను ఏర్పాటు చేయడానికి ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తాం



మహిళలకు ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణం ప్రారంభించే నాటికి ప్రభుత్వం ప్రకటించిన విధంగా అన్ని ఏర్పాట్లను పూర్తిచేస్తాం. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సుల్లో ఉన్న సీటింగ్‌ను అదనంగా 400 పెంచుతాం. మరో 100 బస్సుల్లో బస్సుకు 5 సీట్ల చొప్పున 500 సీట్లు పెంచుతాం. రద్దీ దృష్ట్యా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. బస్సుల భద్రతను పటిష్టం చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం.

-మధుసూదన్, రీజనల్ మేనేజర్

హరితరాయబారి.. బతుకు భారంగా మారి..



చెత్తను సేకరిస్తున్న హరితరాయబారులు (ఫైల్)

- గ్రీన్ అంబాసిడర్ల వేతన వెతలు
- ఏడు నెలలుగా అందక తిప్పలు
- భారంగా కుటుంబ పోషణ

కొత్తచెరువు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉదయం లేవగానే ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించి, ప్రజారోగ్య పరిరక్షణలో కీలకంగా మారిన హరిత రాయబారి (గ్రీన్ అంబాసిడర్) బతుకు భారంగా మారింది. రోజూ పనిచేయడమే తప్ప.. వేతనం మాత్రం అందట్లేదు. ఇలా.. ఏడు నెలలుగా ఎదురుచూపులు తప్పట్లేదు. జీతం అందక బతుకు భారంగా మారిందని హరిత రాయబారులు వాపోతున్నారు. ఇల్లు గడిచేందుకు అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు ఇవ్వాలని కోరుతున్నారు.

1,075 మంది విధులు

జిల్లాలో 16 మేజర్, 467 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో స్వచ్ఛాంధ్రప్రదేశ్ మిషన్ ద్వారా హరితరాయబారుల(క్లాప్ మిత్రల)ను నియమించుకున్నారు. 25 కుటుంబాలకు ఒకరిని చొప్పున నియమించారు. జిల్లావ్యాప్తంగా 1,075 మంది హరిత రాయబారులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు ఉదయాన్నే గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పొడిచెత్త, తడిచెత్తను సేకరించి రిక్షాలు, ఆటోల్లో చెత్త సంపద కేంద్రాలకు తరలిస్తారు. వారికి ప్రతినెలా రూ.6 వేలు చొప్పున ఆయా గ్రామపంచాయతీలు వేతనం అందజేయాల్సి ఉంది. దాదాపు 7 నెలలుగా వారికి జీతాలు అందలేదు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోతున్నారు.

త్వరలోనే జీతాలు చెల్లిస్తాం

జిల్లాలో ఆదాయం తక్కువగా ఉన్న పంచాయతీల్లో పనిచేసే హరిత రాయబారులకు వేతనాలు అందలేదు.ప్రతి నెలా వేతనాల బిల్లును ట్రెజరీకి పంపిస్తున్నాం. 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం త్వరలోనే విడుదల చేయనుంది. ఈ నిధులు ఆయా పంచాయతీల ఖాతాలకు జమవ్వగానే హరిత రాయబారులకు జీతాలు చెల్లిస్తాం.

- సమత, జిల్లా పంచాయతీ అధికారి

ఉమ్మడి జిల్లాకు మరిన్ని

పరిశ్రమలు

సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణ శ్రద్ధ

పురంలో నందమూరి వసుంధరా దేవి

'సుపరిపాలనలలో తొలి అడుగు'కు విశేష స్పందన

హిందూపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లా అభివృద్ధి చెందాలంటే మరిన్ని పరిశ్రమలు రావాల్సి ఉందని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరా దేవి అన్నారు. పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు పుష్కలంగా దొరుకుతాయని అన్నారు. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణ ఈ అంశంపై ప్రత్యేక (మిగతా 6లో...)



హిందూపురం వీవర్స్ కాలనీలో సంక్షేమ పథకాల కరపత్రాన్ని ఇస్తున్న వసుంధరాదేవి

ఫిర్యాదు ఉంటేనే..!

• బదిలీ అక్రమాలపై విచారణకు షరతు • విస్తుగొలిపేలా విద్యాశాఖ నిర్ణయాలు (6లో)

వామ్మో.. చిరుత..!

• సోషల్ మీడియాలో వీడియో వైరల్

(వివరాలు 7లో...)

జీఎస్టీ వసూళ్లు పూర్తి చేయండి: కలెక్టర్



జీఎస్టీ వసూళ్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తిటౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో జీఎస్టీ వసూళ్లు పూర్తి చేయాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన ఉమ్మడి జిల్లా వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ హేమతో కలిసి పన్ను వసూళ్లపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పన్నుదారుల నుంచి జీఎస్టీని సక్రమంగా వసూలు చేయడానికి అధికారులు కృషి చేయాలన్నారు. డిపాజిటర్లు, బ్యాంక్ అటాచ్‌మెంట్ విషయంలో లీడ్ బ్యాంక్‌తోపాటు, ఇతర బ్యాంక్‌లకు కూడా రిజిస్ట్రేషన్ డేటాబేస్ అవకాశం కల్పించాలన్నారు. బిల్లుల చెల్లింపు ముందు ట్యాక్స్ డిడెక్షన్ తప్పకుండా అమలుచేసి, రెవెన్యూ లోటును నివారించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు వా ర్డు పరిధిలో సమాచారం సేకరించి పన్నులు విధించే ప్రక్రియను బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో వాణిజ్య పన్నుల శాఖాధికారులు భాస్కర్, సుధాకర్‌రెడ్డి, చందు, ఎల్‌డీఎం రమణకుమార్, డీటీఓ కరుణాసాగర్‌రెడ్డి తదితరులున్నారు.

మార్గదర్శకులను గుర్తించండి

బంగారు కుటుంబాల మార్గదర్శకులను వేగంగా గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో పీ-4 పథకం అమలు, బంగారుకుటుంబాల దత్తత, మార్గదర్శుల ఎంపిక, గ్రామసభల నిర్వాహణపై ఆర్డీవో, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారు కుటుంబాల దత్తత, మార్గదర్శకాల ఎంపిక, నమోదును వేగంగా పూర్తి చేసి, ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. అధికారులందరూ క్షేత్రస్థాయిలో సమన్వయంతో గ్రామసభలు నిర్వహించి, మార్గదర్శకులను ఎంపిక చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో లోటుపాట్లు సరి చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు సీపీఓ విజయ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచి ర్యాంక్ ఉన్నా అన్యాయం చేశారు

హైకోర్టులో పిటిషనర్ల తరపు న్యాయవాది

28కి అగ్రికల్చర్ అసిస్టెంట్ల కేసు విచారణ వాయిదా 6లో

నకిలీ పత్రాలతో బురిడీ

• ప్లాట్ అమ్మి రూ.21లక్షలు కాజేసిన ఘనుడు
• బుక్కరాయసముద్రంలో కేసు నమోదు (7లో)

హమ్మయ్యా..! పిల్లలు దొరికేశారు

వివరాలు 6లో..

గుప్తనిధుల వేట

- అనంతపురం జిల్లాలో రెండుచోట్ల తవ్వకాలు
- నాగసముద్రం వద్ద తొమ్మిది మంది అరెస్టు
- కుందుర్పి మండలంలో అదుపులో ఓ ముఠా?

(వివరాలు 6లో....)



కుందుర్పి మండలం రుద్రంపల్లి వద్ద గుప్తనిధుల కోసం తవ్విన ప్రాంతం

ఎస్పీని కలిసిన కొత్త ఎస్ఐలు



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఐలు

పుట్టపర్తి రూరల్, జూలై25(ఆంధ్రజ్యోతి): ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి పొందిన పదిమంది పోలీసు అధికారులు ఎస్పీ రత్నను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. 1990 బ్యాచ్‌కి చెందిన వీరు జిల్లాలో ఏఎస్ఐలుగా విధులు నిర్వహించారు. ఉద్యోగోన్నతి రావడంతో రాష్ట్ర పోలీసు అధికారుల కమిటీ సభ్యులు సూర్యకుమార్, ఏఎస్ఐ షౌకత్ అలీతో కలిసి ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. చట్టబద్ధంగా విధులను నిర్వహించాలని ఎస్పీ వారికి సూచించారు.



పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి దేవాలయం

ఇదీ చరిత్ర..

14వ శతాబ్దంలో సంహపురి (నేటి నెల్లూరు)ని కాటమరాజు పరిపాలించే రోజుల్లో విపరీతమైన కరువు సంభవించింది. రాజు ఆజ్ఞ ప్రకారం పశువుల విడిది కోసం సేనాధిపతి రాజ్యమంతా తిరుగుతూ ఖాద్రీ పురం (కదిరి) గ్రామానికి చేరాడు. పట్టణంలోని శ్రీ ఖాద్రీ నరసింహస్వామిని దర్శించుకున్న సేనాధిపతి గుర్రాలను మేతకు విడిచి గ్రామమంతా తిరిగాడు. గ్రామం మొత్తం మల్లెపూల పరిమళం, ఎటుచూసినా పచ్చని పొలాలతో సస్యశ్యామలంగా ఉండడాన్ని చూసి, ఈ ప్రాంతాన్ని కరువు విడిదిగా ఎంచుకున్నాడు సేనాధిపతి. విషయం రాజుకు తెలియజేశాడు. రాజు ఆజ్ఞ ప్రకారం కదిరి పట్టణానికి ఏడు మైళ్ల దూరంలో ఉన్న నల్లచెరువు గ్రామ పరిధిలోని దిన్నె మీద పశువుల కోసం పాగా వేశారు. దిన్నెమీద ఉన్న గడ్డి మేయగానే పశువులు సమృద్ధిగా పాలిచ్చాయి. ఇలా కొన్నిరోజులు గడిచాక పశువులు పాకవేసిన ప్రాంతానికి కొంత దూరంలో పుట్ట ఉండేది. ఆ పుట్ట దగ్గరకు ఈనని గోవులు వెళ్లి నిలబడగా వాటి పొదుగు నుంచి పాలుగారి పుట్టలోకి వెళ్తున్న విషయాన్ని గమనించి సేనాధిపతి ఆశ్చర్యానికి లోనయ్యాడు. పుట్టకు పూజలు చేసి, తవ్వించి చూడగా శ్రీరాముడి పరమ భక్తుడైన ఆంజనేయుడి విగ్రహం బయటపడింది. సేనాధిపతి ద్వారా విషయం తెలుసుకున్న కాటమరాజు.. స్వామి విగ్రహాన్ని ఆ స్థలంలో ప్రతిష్ఠించారు. ఒక్క రోజులోనే స్వామి గుడి కట్టారు. పాలు పారిన దిన్నె కాబట్టి పాలపాటిదిన్నెగా ప్రసిద్ధి చెందింది.

పాహిమాం.. అంజనన్నా..

నేటి నుంచి శ్రావణ మాస ఉత్సవాలు

భక్తుల కొంగుబంగారం పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి

నల్లచెరువు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రమాణాల దేవుడిగా పేరొందిన శ్రీ పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయం ఉత్సవ శోభను సంతరించుకుంది. శనివారం శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. మండలంలో వెలసిన పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా ప్రసిద్ధి. కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాలతోపాటు కర్ణాటక నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. శ్రావణమాస ఉత్సవాలు ప్రత్యేకం. నెలలోని అన్ని శనివారాల్లో స్వామివారి ఉత్సవాలు నిర్వహిస్తారు. మంగళవారాల్లో కూడా ప్రత్యేక పూజలు చేస్తారు. దీంతో శ్రావణ మాసం అంతా ఆలయంలో సందడిగా ఉంటుంది. స్వామి సన్నిధిలో అబద్ధపు ప్రమాణం చేస్తే కీడు వాటిల్లుతుందని భక్తుల విశ్వాసం. దీంతో పక్క జిల్లాల నుంచి ఇక్కడికి ప్రమాణాలు చేసేందుకు వస్తుంటారు.

బావిలో చేదబావి

ఆలయ ప్రాంగణంలోని బావిలో చేదబావి ఉండడం ఎంతో ప్రత్యేకం. ఈ బావిలో స్నానం ఆచరించి తలనీలాలు సమర్పించి దేవుడిని దర్శించుకుంటే పుణ్యం ప్రాప్తిస్తుందని భక్తుల నమ్మకం. ఎలాంటి కరువుకాటకాలు వచ్చినా ఈ చేద బావిలో నీరు ఇంకిపోదు. శ్రావణ మాసంలో ఐదు శనివారాల్లో ఉత్సవాలు, మంగళవారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



బావిలో ఉన్న చేదబావి

భక్తులకు వసతులు కల్పించాం



ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలను పురష్కరించుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను నడపనుంది. దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. పోలీసు శాఖ ద్వారా పటిష్ట బందోబస్తు కల్పిస్తాం.

- మురళీకృష్ణ, ఆలయ ఈఓ



ఆంజనేయ స్వామి మూలవిరాట్

ఆలయానికి చేరుకోవచ్చు ఇలా..

కదిరి నుంచి నల్లచెరువు పాతరైల్వేస్టేషన్ వద్ద దిగితే అక్కడినుంచి ఆటోలు వెళ్తాయి. నల్లచెరువు నుంచి పాలపాటి దిన్నెకు ఆటోలు నడుస్తుంటాయి. ఆర్టీసీ శ్రావణమాసం సందర్భంగా 20 ప్రత్యేక బస్సులు నడుపుతోంది. కదిరి నుంచి ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు నడుస్తుందని ఆర్టీసీ డీఎం తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు మరిన్ని పరిశ్రమలు

(5వ పేజీ తరువాయి)

శ్రద్ధ పెట్టారని అన్నారు. హిందూపురం నియోజకవర్గంలో శుక్రవారం ఆమె విస్తృతంగా పర్యటించారు. తూమకుంట చెక్‌పోస్టు వద్ద ఆమెకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి గోళ్లాపురం పారిశ్రామికవాడకు వెళ్లి నూతనంగా నిర్మించిన 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. హిందూపురం మండలంలోని వీవర్స్ కాలనీలో ఇంటింటికి వెళ్లి 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం లేపాక్షి-ఒబుళాపురం బీటీ రోడ్డును ప్రారంభించారు. చిలమత్తూరు మండలం తమ్మినాయనపల్లి రోడ్డుకు భూమిపూజ చేశారు. హెరిటేజ్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన సోలార్ వాటర్ హీటర్లను లేపాక్షి నవోదయ పాఠశాలలో ప్రారంభించారు.



లేపాక్షి నవోదయ పాఠశాలలో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న వసుంధరాదేవి

విద్యార్థినులను పలకరించి, యోగక్షేమాలను తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. హిందూపురం వీవర్స్‌కాలనీ, 8, 9 వార్డులలో జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, హిందూపురం నియోజకవర్గానికి మరిన్ని పరిశ్రమలు వస్తాయని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారని అన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, తొలి అడుగు కార్యక్రమంలో మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు ముందుకొచ్చి ఈ విషయం చెబుతున్నారని అన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు కాలువలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడానికి హిందూపురానికి రూ.92 కోట్లు నిధులు వచ్చాయని తెలిపారు. పట్టణంలో పాత పైప్‌లైన్ స్థానంలో కొత్త పైప్‌లైన్ ఏర్పాటుకు రూ.136 కోట్లు మంజూరయ్యాయని, ఈ పనులు త్వరలో ప్రారంభమౌతాయని తెలిపారు. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చని అన్నారు. శ్రావణమాసం మొదటి శుక్రవారం హిందూపురంలో జనం మధ్య గడపటం సంతోషంగా ఉందని అన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధుల కింద రూ.45కోట్ల పనులు జరిగాయని తెలిపారు. వచ్చే రెండు మూడు మాసాల్లో మరో రూ.40 కోట్లు వస్తాయని తెలిపారు. హిందూపురం చేనేత కార్మికులు నేసిన చీరలనే తాను ధరిస్తానని అన్నారు. పలుచోట్ల మహిళలు వసుంధరాదేవికి చీర, సారె, పసుపు కుంకుమ అందజేశారు. మహిళలను ఆమె ఆప్యాయంగా పలకరిస్తూ, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏలు సురేంద్ర, వీరయ్య, మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థరెడ్డి, పార్టీ కన్వీనర్లు ప్రెస్ వెంకటేశ్, హెచ్ఎన్ రాము, అభిలాష్, శ్రీనివాస్, నాయకులు దేవరాజ్, మంగేష్, అనీల్, పరిమళ, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలతోనే ఆర్థిక ప్రగతి : ఇన్‌చార్జ్ కలెక్టర్



అనంతపురం కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపన విస్తృతంగా జరగాలని, వాటితో ఆర్థిక ప్రగతి సాధించవచ్చని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం 60వ జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డీఐఏపీసీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పారిశ్రామిక రంగం పటిష్టం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ఆహ్వానించి వారికి సకాలంలో సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులను ఇవ్వాలన్నారు. గత నెలలో జరిగిన సమావేశం నుంచి ప్రస్తుతం సింగిల్ డెస్క్ విధానంలో 224 ఔత్సాహికులు దరఖాస్తు చేసుకోగా 25 దరఖాస్తులను ఆమోదించారని, మిగిలిన దరఖాస్తులను సత్వరమే పరిశీలించి ఆమోదించాలని ఆదేశించారు. జిల్లాలో 2020-23, 2023-27 పాలసీలో 13 యూనిట్లకు గాను రూ.2,30,54,540లు సబ్సిడీ మంజూరుకు సమావేశంలో ఆమోదం తెలిపారు. జిల్లాలో ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాలను గుర్తించాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌ను ఆదేశించారు. జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేయబోతున్న రతన్ టాటా ఇన్నొవేషన్ హబ్ ద్వారా యువతకు టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్, స్కిల్ ట్రైనింగ్ ఇచ్చే విధంగా ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాస్‌యాదవ్, ఏడీ రాజశేఖర్‌రెడ్డి, వాణిజ్య శాఖ కృష్ణారెడ్డి, ఆర్టీఓ వీర్రాజు, ఏపీఐఐసీ మేనేజర్ మల్లికార్జున, డీఎస్‌డీఓ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రతి శాఖ సమన్వయంతో పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారంలో ఎన్‌సీఓఆర్‌డీ(నార్కో కోఆర్డినేషన్ సెంటర్)జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ... మాదక ద్రవ్యాల వినియోగంతో జరిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గంజాయి సాగు లాంటివి ఎక్కడైనా జరిగినట్లు తెలిస్తే టోల్‌ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం అందించాలన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో టోల్‌ఫ్రీ ఏర్పాటు చేసి డ్రగ్స్ సరఫరా, వినియోగం లేకుండా గట్టి నిఘా పెంచి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, సీఐలు హరినాథ్, హనుమంతు పాల్గొన్నారు.

గుప్తనిధుల వేట



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎక్స్‌కవేటర్, సుమో

జిల్లాలో రెండుచోట్ల తవ్వకాలు

నాగసముద్రం వద్ద తొమ్మిది మంది అరెస్టు

కుందుర్పి మండలంలో అదుపులోకి ముఠా?

గుంతకల్లు/కళ్యాణదుర్గం/కుందుర్పి, జూలై25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు వేర్వేరుచోట్ల గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపడుతున్న ముఠాల ఆట కట్టించారు పోలీసులు. ఓ చోట తొమ్మిది మందిని అరెస్టు చేయగా.. మరోచోట ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గుంతకల్లు మండలం నాగసముద్రం గ్రామం వద్ద గుప్తనిధుల కోసం తవ్వకాలు చేస్తున్న తొమ్మిది మందిని గుంతకల్లు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. ముఠా అరెస్టు వివరాలను శుక్రవారం ఉదయం గుంతకల్లు రూరల్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసులు వెల్లడించారు. నాగసముద్రం గ్రామం వద్ద ఉన్న చౌడమ్మ దేవాలయ సమీపంలో కొందరు గుప్తనిధుల కోసం తవ్వకాలు చేస్తున్నారన్న సమాచారం రావడంతో రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం దాడి చేశారు. అనంతపురం జిల్లా, తెలంగాణ రాష్ట్రానికి చెందిన తొమ్మిది మంది తవ్వకపు సామగ్రితో పట్టుబడ్డారు. వజ్రకరూరు మండలం కొనకొండ్లకు చెందిన తిమ్మాపురం రాము, కమలపాడు వాసి బురుజుల బోయ శ్రీనివాసులు, గుంతకల్లు పట్టణం దోనిముక్కల రోడ్డులో నివసిస్తున్న మేకల దేవేంద్ర, పామిడి మండలం గజరాంపల్లికి చెందిన జే పరశురాముడు, తెలంగాణ రాష్ట్రానికి చెందిన పసుపుల మహేందర్, ఇరికల వెంకటేశులు, మాడ మహేందర్, భట్టగిరి అంజులయ్య, ముద్దనూరి సురేంద్రను అరెస్టు చేశారు. మరో ఇద్దరు సూరి, నారాయణస్వామి పరారయ్యారని డీఎస్పీ తెలిపారు. పట్టుబడిన వారి నుంచి ఆటో, ఇన్నోవా వాహనం, గుప్త నిధులను గుర్తించే మెటల్ డిటెక్టర్, తవ్వకం సామగ్రితోపాటు, తవ్వకాల్లో దొరికిన మట్టికుండ, 8 సీసపు గోళీలు, సీసపు కడ్డీలు, రెండు చిన్న ఉంగరాలు, రెండు చిన్న ప్రతిమలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పోలీసుల అదుపులో 9 మంది..

కుందుర్పి మండలంలోని రుద్రంపల్లి సమీపాన మల్లప్ప దేవాలయ పరిసర ప్రాంతంలో ఓ తోటలో గురువారం అర్ధరాత్రి గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపడుతున్న 9 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఎక్స్‌కవేటర్, సుమో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఓ వ్యక్తి గుప్తనిధులు తీసుకువచ్చి ఈ ప్రాంతంలో పాతిపెట్టి, చనిపోయాడని పలువురు ఆ దాచిపెట్టిన గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టారు.

అలా.. పోలీసులకు దొరికిపోయినట్లు తెలుస్తోంది. కుందుర్పి మండలం రుద్రంపల్లికి చెందిన ముగ్గురు, అనంతపురానికి చెందిన ముగ్గురు, కేరళ వాసులు ఇద్దరు, కంబదూరు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. రెండ్రోజుల్లో వివరాలు వెల్లడించే అవకాశాలు ఉన్నాయి.

ఫిర్యాదు ఉంటేనే..!

● బదిలీ అక్రమాలపై విచారణకు షరతు ● విస్తుగొలిపేలా విద్యాశాఖ నిర్ణయాలు

అనంతపురం విద్య, జూలై 25(ఆంధ్రజ్యోతి): బదిలీల సమయంలో అడ్డదారులు తొక్కిన ఉపాధ్యాయులకు విద్యాశాఖ కమిషనరేట్ 'పెద్ద ఊరట' కల్పించింది. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు, 'గడువులోగా వచ్చిన ఫిర్యాదులపై మాత్రమే విచారించండి' అని జిల్లా అధికారులను ఆదేశించింది. జిల్లాలో బదిలీలలో లబ్ధికోసం 422 మంది ఉపాధ్యాయులు మెడికల్ సర్టిఫికెట్లను సమర్పించారు. వీటిలో భారీగా నకిలీవి ఉన్నాయని అప్పట్లో కొందరు ఉపాధ్యాయులు గగ్గోలు పెట్టారు. వీటిలో 12 సర్టిఫికెట్లపై మాత్రమే అప్పట్లో ఫిర్యాదులు అందాయి. దీంతో వాటిని మాత్రమే విద్యాశాఖ అధికారులు పరిగణనలోకి తీసుకుని, విచారించేందుకు సిద్ధమవుతున్నారు.

భారీగా అక్రమాలు

బదిలీల సమయంలో తమకు అనుకూలమైన ప్రాంతాలకు వెళ్లేందుకు పలువురు ఉపాధ్యాయులు అడ్డదారులు తొక్కారు. నకిలీ మెడికల్ సర్టిఫికెట్లు సమర్పించారు. నిబంధనల మేరకు స్పౌజ్ పాయింట్లు పెట్టి ఉంటే భర్త, లేదా భార్య ఎక్కడ పనిచేస్తుంటే అక్కడకు బదిలీ చేయాల్సి ఉంటుంది. కానీ వెబ్ కౌన్సెలింగ్‌లో ఇష్టానుసారంగా స్థానాలకు ఆప్షన్లు ఇచ్చారు. లేని రోగాలు ఉన్నట్లు చూపించి, నకిలీ మెడికల్ సర్టిఫికెట్లు సమర్పించారు. తద్వారా ప్రిఫరెన్షియల్ కేటగిరీలో కోరుకున్న స్థానాలను దక్కించుకున్నారు. ఈ అక్రమాలపై బాధిత ఉపాధ్యాయులు అప్పట్లో గళం విప్పారు. అధికారులు విచారించి, న్యాయం చేయాలని వేడుకున్నారు.

షరతులు వర్తించాయి..

అక్రమాలపై విచారిస్తామని చెబుతూనే.. అక్రమార్కులకు కొందరు అధికారులు అప్పట్లో కొమ్ము కాశారు. బదిలీలలో చేయాల్సిందంతా చేశారు. ఇప్పుడు ప్లేటు ఫిరాయించి, అభ్యంతరాలకు గడువు ఇచ్చామని, ఆ లోగా వచ్చిన ఫిర్యాదులను మాత్రమే విచారిస్తామని అంటున్నారు. జిల్లాలో 12 మంది ఉపాధ్యాయుల మెడికల్ సర్టిఫికెట్లపై మాత్రమే ఫిర్యాదులు వచ్చాయని, వాటిని మాత్రమే విచారిస్తామని డీఈఓ ప్రసాద్‌బాబు అంటున్నారు. స్పౌజ్, అక్రమ పాయింట్లు వంటి ఇతర ఫిర్యాదుల విషయంలోనూ 'గడువులోగా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసి ఉంటేనే' అని డీఈఓ కార్యాలయ అధికారులు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఇది కమిషనరేట్ నిర్ణయం అని చెప్పి తప్పుకుంటున్నారు. దీంతో అక్రమార్కులు 'హమ్మయ్యా..' అని ఊపిరి పీల్చుకుంటున్నారు. నష్టపోయిన ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంచి ర్యాంక్ ఉన్నా అన్యాయం చేశారు

హైకోర్టులో పిటిషనర్ల తరపు న్యాయవాది

అగ్రికల్చర్ అసిస్టెంట్ల కేసు విచారణ 28కి వాయిదా

అనంతపురం అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మంచి ర్యాంకు ఉన్న అగ్రికల్చర్ అసిస్టెంట్లకు బదిలీల్లో అన్యాయం చేయడంతో పాటు స్టేటస్ కో ఆర్డర్‌ను అమలు చేయలేదని పిటిషనర్ల తరపు న్యాయవాది హైకోర్టులో వాదనలు వినిపించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో తమకు అన్యాయం జరిగిందని శ్రీసత్యసాయి జిల్లాలోని 11 మంది, అనంత జిల్లాలో ఇద్దరు, కర్నూలులో 20 మంది, ప్రకాశం, చిత్తూరు జిల్లాకు చెందిన మరికొందరు అగ్రికల్చర్ అసిస్టెంట్లు హైకోర్టును వేర్వేరుగా ఆశ్రయించారు. ఆయా జిల్లాల సిబ్బంది రిట్ పిటిషన్లపై హైకోర్టు వేర్వేరుగా స్టేటస్‌కో ఆర్డర్లు జారీ చేసింది. అయితే ఆయా జిల్లాల సిబ్బంది అందరిది ఒకే సమస్య కావడంతో అన్ని పిటిషన్లను కలిపి ఈనెల 23న విచారణకు పిలిచింది. అయితే అగ్రికల్చర్ అసిస్టెంట్ల పిటిషన్‌పై వ్యవసాయ శాఖ కౌంటర్ (అఫిడవిట్) దాఖలు చేయకపోవడంతో శుక్రవారానికి విచారణ వాయిదా వేసిన విషయం తెలిసిందే. శుక్రవారం రెండో సారి విచారణలో ఉమ్మడి అనంతకు జిల్లా పిటిషనర్ల తరపు న్యాయవాది అగ్రికల్చర్ అసిస్టెంట్ల బదిలీల్లో జరిగిన అన్యాయాన్ని జడ్జి దృష్టికి తీసుకువెళ్లారు. మరింత సమాచారం సేకరణ కోసం విచారణను ఈనెల 28కి జడ్జి వాయిదా వేశారు.

స్టేటస్‌కోను పట్టించుకోని అధికారులు

ఉమ్మడి జిల్లాకు సంబంధించి రైతు సేవా కేంద్రంలో పనిచేసే విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు గత నెల 28న అనంత జేడీఏ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. పలువురు సిబ్బందికి మంచి ర్యాంక్ ఉన్నా వారు అడిగిన స్థానాలు కేటాయించలేదు. దీంతో తమకు మంచి ర్యాంక్ లున్నా, అడిగిన మూడు ఆప్షన్లల్లో ఏ ఒక్క స్థానం ఇవ్వకుండా అన్యాయం చేశారంటూ శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన 11 మంది అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఈనెల 14న హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. ప్రస్తుతం సిబ్బంది పనిచేస్తున్న స్థానాల్లోనే రెండు వారాల పాటు కొనసాగించాలంటూ ఈనెల 15న హైకోర్టు స్టేటస్‌కో ఆర్డర్ ఇచ్చింది. దీన్ని ఉద్యోగుల తరపు న్యాయవాది ఈనెల 17న అనంత జేడీఏ కార్యాలయంలో అందజేసినట్లు సమాచారం. అయితే తమకు కోర్టు ద్వారా నేరుగా ఉత్తర్వులు రాలేదన్న కారణంతో సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోలేదని సమాచారం. శుక్రవారం జరిగిన విచారణకు జేడీఏ కార్యాలయం నుంచి ఓ అధికారిని పంపారు. అయితే స్టేటస్ కో ఆర్డర్ మేరకు సంబంధిత అధికారులకు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని సమాచారం. బదిలీల్లో అన్యాయం చేయడంతోపాటు స్టేటస్ కో ఆర్డర్‌ను అమలు చేయలేదన్న విషయాన్ని న్యాయవాది జడ్జి దృష్టికి మరో సారి తాజా పరిస్థితిని తీసుకువెళ్లినట్లు తెలిసింది.

ప్రతి సమస్యకూ పరిష్కారం చూపిస్తాం

'మీ సమస్య.. మా బాధ్యత'లో పరిటాల శ్రీరామ్

ధర్మవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకూ తప్పక పరిష్కారం చూపిస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. పట్టణంలోని శివానగర్, కేశవనగర్‌లో శుక్రవారం 'మీ సమస్య.. మా బాధ్యత' పేరిట వినూత్న కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు. శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకుని, అక్కడే ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. కేశవనగర్‌లో గ్రీవెన్స్ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, మున్సిపల్, విద్యుత్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.ప్రజల సమస్యలలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ, సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో తమ దృష్టికి అనేక సమస్యలు వచ్చాయని అన్నారు. వాటిని పరిష్కరించే బాధ్యతను తీసుకుంటామని అన్నారు. సచివాలయ స్థాయిలో ఉన్నవి ఇక్కడే పరిష్కరిస్తామని, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తామని అన్నారు. వైసీపీ హయాంలో నిర్ణయాలవల్ల పింఛన్లు, ఇంటి స్థలాల పట్టాల విషయంలో అక్రమాలు జరిగాయని, అర్హులకు అన్యాయం జరిగిందని అన్నారు. పరిశీలించి, న్యాయం చేస్తామని అన్నారు. అమరావతి గురించి మాట్లాడే నైతిక హక్కు మాజీ సీఎం జగన్‌కు లేదని విమర్శించారు. వారి ఎమ్మెల్యేలతో కలిసి అక్కడ పర్యటిస్తే జరిగిన అభివృద్ధి ఏమిటో తెలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏపీసీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి చింతలపల్లి మహేశ్ చౌదరి, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, 7వ వార్డు ఇన్‌చార్జి పల్లపు రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తూ, సమస్యలను తెలుసుకుంటున్న పరిటాల శ్రీరామ్

హమ్మయ్యా..! పిల్లలు దొరికేశారు

స్కూల్ నుంచి వెళ్లిపోయిన విద్యార్థులు సేఫ్

తిరుమల నుంచి తీసుకొస్తున్న పోలీసులు

అనంతపురం క్రైం/విద్య, జూలై 25(ఆంధ్రజ్యోతి): స్కూల్ నుంచి వెళ్లిపోయిన విద్యార్థులను అనంతపురం పోలీసులు గుర్తించారు. రాత్రింబవళ్లు శ్రమించి శుక్రవారం తిరుమలతో ఉన్నట్లు గుర్తించి అనంతపురం తీసుకొస్తున్నారు. కూడేరు, నార్పల, గార్లదిన్నె, గోరంట్ల మండలాలకు చెందిన విద్యార్థులు నగరంలోని మూడో రోడ్డులో ఉన్న బీసీ హాస్టల్‌లో ఉంటూ పొట్టి శ్రీరాములు స్కూల్‌లో చదువుకుంటున్నారు. ఎప్పటిలాగే గురువారం పాఠశాలకు వెళ్లారు. అయితే అక్కడి నుంచి టీచర్ల కళ్లు కప్పి బయటకు వెళ్లి పోయారు. బడి వదిలిన తర్వాత విద్యార్థులు హాస్టల్‌కు వెళ్లలేదు. రాత్రి పొద్దుపోయినా రాకపోవడంతో కపోవడంతో విద్యార్థుల ఇళ్లకు ఫోన్ చేసి ఆరా తీశారు. అక్కడికి రాలేదని తెలియడంతో త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వార్డెన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ విద్యార్థుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. బెంగళూరు, తిరుపతి నగరాలకు వెళ్లిన రెండు బృందాల పోలీసులు ముమ్మరంగా గాలించారు. ఎట్టకేలకు టెక్నాలజీ సాయంతో విద్యార్థులు తిరుమలలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడి పోలీసుల సహకారంతో ఆ విద్యార్థులను గుర్తించి మూడో పట్టణ పోలీసులు శుక్రవారం దగ్గరకు తీసుకున్నారు. తిరుమల నుంచి అనంతపురం బయల్దేరారు. విద్యార్థుల ఆచూకీ కనిపెట్టడంపై సీఐ శాంతిలాల్ మాట్లాడుతూ ముగ్గురు పోలీసులను తిరుమలకు పంపి వెతికించామని పేర్కొన్నారు. సీసీ కెమెరాల్లో పరిశీలించి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి గుర్తించినట్టు తెలిపారు. విద్యార్థులను గుర్తించడంతో అటు తల్లిదండ్రులు, ఇటు పోలీసులు, హాస్టల్, స్కూల్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

సామాజిక బాధ్యతకు తూట్లు..!

(5వ పేజీ తరువాయి)

ప్రబలే ప్రమాదం ఉంది. ఆ రోడ్లపై నడవాలంటే బురద తొక్కాల్సిందే. వాహనాలు వెళ్తే మురుగు నీరు ఇళ్లలోకి, పాదచారులపై పడుతుండడంతో ఆందోళన చెందుతున్నారు.

ప్రారంభానికి ముందే..

ఎల్‌ఏడీఎఫ్ నిధులతో చేపట్టిన ఆర్వో ప్లాంట్ల నిర్మాణాల గురించి చెప్పక్కర్లేదు. అన్ని ప్రాంతాల్లో ఆర్వో ప్లాంట్లు బిగించారే తప్ప.. విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. త్వరలో ప్రారంభించాల్సి ఉంది. నేలపై బెడ్డింగ్ సరిగా లేకపోవడంతో పగిలిపోయింది. ఎంత వ్యయంతో ప్లాంట్ల నిర్మాణం చేపట్టారన్న వివరాలు నోటీసు బోర్డులో కూడా పొందుపరచకపోవడం గమనార్హం. పి.కొత్తపల్లి పంచాయతీ పరిధి ఎగువతూపల్లి ఎస్సీ కాలనీలో ఆర్వో ప్లాంట్లు చెరువు ప్రాంతంలో ఏర్పాటు చేశారు. చెరువులోకి నీరు వస్తే ఆర్వో ప్లాంట్లు మునిగిపోతాయి. నాసిరకంగా, అనువుగాని చోట నిర్మాణాలు చేపట్టి, నిధులు బొక్కేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ఎగువతూపల్లి ఆర్వో ప్లాంటు వద్ద కుంగిన నేల

వెలగని సోలార్ వీధిదీపాలు

నంబులపూలకుంట, పి.కొత్తపల్లి, పెడబల్లి పంచాయతీల్లో దాదాపు వందకుపైగా సోలార్ వీధిదీపాలు వెలగడంలేదు. ఒక్కో విద్యుత్ దీపానికి రూ.వేలు వెచ్చించి ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు ఏర్పాటు చేశారు. ఏడాది కూడా తిరక్కుండానే అవి వెలగట్లేదు. దీంతో స్తంభాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. పంచాయతీ అధికారులను అడిగితే తమకు తెలియదు అంటున్నారు. వెలగని వీధిదీపాల స్థానంలో ప్రత్యామ్నాయంగా ఏర్పాటు కూడా చేయట్లేదు.

నాణ్యంగా నిర్మాణాలు చేపట్టాలి



సీఎస్ఆర్ నిధులతో చేపట్టే నిర్మాణాలు నాణ్యగా ఉండాలి. పూర్వం నుంచి సాగుచేసుకుంటున్న భూములను సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు రైతులు ఇచ్చారు. ఊర్లలోని అందరూ బాగుంటారని త్యాగం చేశారు. వారి త్యాగాల ఫలితంగా లభించే సీఎస్ఆర్ నిధులతో చేపట్టే ఆర్వో ప్లాంట్ల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలిస్తున్నారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచి తాగునీరు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాలి. అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి, పనులు నాణ్యతగా చేపట్టాలి.

- గంగిరెడ్డి, రైతు సంఘం మండల కార్యదర్శి

పాఠశాల భవనం నిర్మించాలి



మా గ్రామంలో ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. సోలార్ పార్కు సీఎస్ఆర్ నిధులతో నూతన భవనాన్ని నిర్మించాలి. ప్రసిద్ధిగాంచిన వీరభద్రస్వామి ఆలయ నిర్మాణం చేపట్టాలి.

- నరసింహులు, వంకమద్ది

క్రైం కార్నర్

రైలు కిందపడి మహిళ మృతి

అనంతపురం న్యూటౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): కల్లూరు, గార్లదిన్నె స్టేషన్ల మధ్య శుక్రవారం రైలు కిందపడి గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. రైల్వే ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉదయం 8.30 గంటల సమయంలో ఘటన జరిగిందన్నారు. 30 నుంచి 35 ఏళ్లలోపు వయసున్న మహిళ పంజాబీ డ్రస్‌తో ఉందన్నారు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందిందన్నారు. మృతురాలికి సంబంధించి ఎలాంటి ఆధారాలూ లభించకపోవడంతో గుర్తుతెలియని మహిళగా కేసు నమోదు చేసుకున్నామన్నారు. మృతదేహాన్ని అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించామన్నారు. మృతురాలికి సంబంధించి వారు, ఆచూకీ తెలిసిన వారు 9441445354 నంబరులో సంప్రదించవచ్చని ఎస్‌ఐ తెలిపారు.

నకిలీ పత్రాలతో బురిడీ

- ప్లాట్ అమ్మి రూ.21 లక్షలు కాజేసిన ఘనుడు
- బుక్కరాయసముద్రంలో కేసు నమోదు



ప్లాటును పరిశీలిస్తున్న సీఐ పుల్లయ్య, బాధితురాలు

బుక్కరాయసముద్రం, జూలై 25(ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలతో ఓ మహిళకు ప్లాట్‌ను విక్రయించి, రూ.21లక్షలకు బురిడీ కొట్టించిన సంఘటన మండలంలోని గోవిందంపల్లిలో వెలుగుచూసింది. పోలీసు లు, బాధితురాలు తెలిపిన మేరకు... తాడిపత్రి మండలం చిన్న పొలమాడ గ్రామానికి చెందిన చక్కారాము గోవిందంపల్లి గ్రామంలో సర్వేనెంబరు 295-5లో వేసిన లేఅవుట్‌లో ప్లాటు నంబరు 114, 115లో 7.16 సెంట్ల భూమి తన పేరుపై ఉన్నట్లు నకిలీ పత్రాలు సృష్టించు కుని, రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. తర్వాత అనంతపురం వినాయక్ నగర్‌కు చెందిన చాకలి నాగరత్నమ్మకు సెంటు రూ.3లక్షల ప్రకారం ఏడు సెంట్లకు రూ.21లక్షలు తీసుకుని 2021 మార్చి 12న విక్రయించా డు. ఇటీవల ఆ స్థలాన్ని శుభ్రం చేయించుకోవడానికి చాకలి నాగరత్న మ్మ అక్కడికి వెళ్లారు. అప్పటికే ప్లాటు ఒరిజనల్ యాజమాని కాంతమ్మ ఫెన్సింగ్ వేసుకుని ఉన్నారు. దీంతో తమ ప్లాట్‌ను ఎవరో ఆక్రమించారని భావించిన చాకలి నాగరత్నమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కాంతమ్మను, ప్లాట్‌ను అమ్మిన చక్కారామును పిలిపించి డాక్యుమెంట్లను సీఐ పుల్లయ్య పరిశీలించారు. చక్కారాము చూపిన డాక్యుమెంట్ నకిలీది అని తేల్చారు. బాధితురాలు చాకలి నాగరత్నమ్మ ఫిర్యాదు మేరకు చక్కా రాముపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇంట్లో ఉన్న బంగారం కుదువపెట్టి, బయట అప్పు చేసి ప్లాట్ కొని, ఇలా మోసపోయానని చాకలి నాగరత్నమ్మ కన్నీరు మున్నీరుగా విలపించారు. పోలీసులు న్యాయం చేయకపోతే తమ కుటుంబం వీధిన పడుతుందని విలపించారు.

భర్త, అత్తపై వేధింపుల కేసు

ధర్మవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): తనను తరచూ వేధిస్తున్నారని భర్త, అత్తపై దండగల భవానీ ఫిర్యాదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు...పట్టణంలోని గిర్రాజుకాలనీకి చెందిన దండగ భవానీ టైలరింగ్ వృత్తితో జీవిస్తోంది. ఈమె భర్త హరీశ్. ఈయన తన తల్లి లక్ష్మీదేవి మాటలు వింటూ తరచూ భవానీ వేధించేవాడు. మద్యానికి బానిసై, వివాహేతర సంబంధాలతో కాలం గడిపేవాడు. తరచూ అవమానిస్తూ, విడాకులు ఇవ్వాలని వేధించేవాడు. దీనికి అతడి తల్లి వత్తాసు పలికేది. ఈ విషయాన్ని భవానీ తన తల్లిదండ్రులకు తెలిపింది. వారు పలు మార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు పెట్టినా భర్త, అత్తలో ఏమాత్రం మార్పు రాలేదు. వేధింపులు తట్టుకోలేక భవానీ మూడు నెలల కిందట పుట్టినిల్లు అయిన పుట్టపర్తి మండలం కర్ణాటక నాగేపల్లికి వెళ్లింది. అయినా హరీశ్ ఫోన్‌లో ఆమెను వేధించేవాడు. దీంతో భవాని, ఆమె తల్లి లక్ష్మి శుక్రవారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు హరీశ్, లక్ష్మీదేవిలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థినికి వేధింపులు.. పోక్సో కేసు నమోదు

గుత్తి, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థినిని వేధించడమే కాక, బెదిరించి ఫొటోలు దిగిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలానికి చెందిన విద్యార్థినిపై తురకపల్లికి చెందిన మధుసూదన్ ప్రేమ పేరుతో వేధింపులకు పాల్పడ్డాడు. ఆమె తల్లితండ్రులను చంపుతానని బెదిరించి, విద్యార్థినితో ఫొటోలు దిగాడు. అతడి వేధింపులతో విద్యార్థిని తల్లితండ్రులు ఊరు వదిలి గుత్తి ఆర్ఎస్‌కు చేరుకుని, ఇక్కడే నివశిస్తున్నారు. అయినా మధుసూదన్ వదల్లేదు. తనను వివాహం చేసుకోవాలని హెచ్చరించాడు. 'లేదంటే నిన్నూ, నీ కుటుంబాన్నీ అంతం చేస్తా' అని బెదిరించాడు. దీంతో విషయాన్ని విద్యార్థిని.. తల్లిదండ్రులకు చెప్పింది. వారు శుక్రవారం గుత్తి పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఆ మేరకు మధుసూదన్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

కోరిక తీర్చకుంటే చంపుతా..!

- మహిళకు లైంగిక వేధింపులు
- కేసు నమోదు

యాడికి, జూలై25(ఆంధ్రజ్యోతి): తన కోరిక తీర్చకపోతే చంపుతా అంటూ మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలానికి చెందిన మహిళ శుక్రవారం ఉదయం పొలం వద్ద పనులు చేసుకుంటుండగా లక్షుంపల్లికి చెందిన వెంకటేశ్వరరెడ్డి ఆమె వద్దకెళ్లాడు. చేయి పట్టుకుని, బలాత్కారం చేయబోయాడు. తన కోరిక తీర్చాలనీ, లేకపోతే చంపుతానని బెదిరించాడు. అతడి బారి నుంచి తప్పించుకున్న మహిళ.. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు వెంకటేశ్వరరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చీనీ టన్ను రూ.17వేలు

అనంతపురం రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్టంగా 17,500తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 1438 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పాడి రైతుల జీవన ప్రమాణాలపై సర్వే

అనంతపురం అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాడి రైతులు, గొర్రెలు, మేకల కాపరుల జీవన ప్రమాణాలు, స్థితిగతులపై సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. జిల్లాలోని 87వేల కుటుంబాలను సమగ్ర సర్వే చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. జిల్లాలో శుక్రవారం ఈ సర్వే మొదలైందని, సెప్టెంబరు 15 దాకా కొనసాగుతుందన్నారు. స్థానిక వెటర్నరీ సిబ్బందితో ఈ సర్వే చేయిస్తున్నామన్నారు. ఆయా కుటుంబా ల్లో పాడి, గొర్రెల పెంపకం ద్వారా ఎంత ఆదాయం వస్తోంది..? బ్యాంక్ నుంచి రుణం పొందారా..? ప్రభుత్వ పరంగా ఏఏ పథకాలు వర్తింప జేస్తున్నా రు..? ఇంకా ఏమైనా సాయం అవసరమా..? తదితర అంశాలపై సమగ్ర సర్వే చేసి, ప్రత్యేక ప్రొఫార్మాలో పొందుపరుస్తామన్నారు. సర్వేకు పాడి రైతులు, గొర్రెల పెంపకందారులు సహకరించాలని సూచించారు.

28న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి జూనియర్ బాల, బాలికల విభాగాల్లో అథ్లెటిక్ ఎంపిక పోటీలు ఈనెల 28వ తేదీన స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ కమిటీ చైర్మన్ ఇస్మాయిల్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయిలో అండర్ 14, 16, 18, 20 బాల, బాలికల విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హతగల వారు యూనిఫాంతో హాజరుకావాలన్నారు. ఎంపికైన వారు ఆగస్టు 9వ తేదీ నుంచి బాపట్లలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వివరాలకు 9052288643, 9494434767 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వామ్మో.. చిరుత..!

అనంతపురం సమీపాన సంచారం

- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- ప్రజలకు పోలీసుల జాగ్రత్తలు
- రాయదుర్గం వద్ద కొండపై మరొకటి ప్రత్యక్షం

అనంతపురం క్రైం/రూరల్/రాయదుర్గం రూరల్/గుమ్మఘట్ట, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేర్వేరుచోట్ల చిరుతల సంచారం అలజడి రేపింది. అనంతపురం రూరల్ మండలంలో చీకట్లో చిరుత పరుగులు తీస్తున్న వీడియో శుక్రవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. రూరల్ ఏరియాలోని బీఎస్ఆర్ కాలనీ, సదా శివ కాలనీ ప్రాంతాల వెనుక వైపున చిరుత సంచరిస్తోందంటూ స్థానిక ప్రజలు భయాందోళనకు లోనయ్యారు. దీంతో రూరల్ సీఐ శేఖర్, ఎస్ఐ రాంప్రసాద్, పోలీసు సిబ్బంది.. రాత్రి ఆయా ప్రాంతాలకు వెళ్లి గాలించారు. ప్రజలను అప్రమత్తం చేశారు. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. నాలుగు రోజుల క్రితం కూడా నరసనాయునికుంట ప్రాంతంలో కుక్కలపై చిరుత దాడి చేసిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే బీఎస్ఆర్ కాలనీ ప్రాంతానికి సైతం కుక్కల కోసం చిరుత వచ్చి ఉండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పంపనూరు అటవీ ప్రాంతం నుంచీగానీ, ఇతర ప్రాంతాల నుంచీగానీ చిరుత వచ్చి ఉండే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ, భయపడాల్సిన అవసరం లేదని పోలీసులు సూచించారు.



అనంతపురం రూరల్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కొండపై చిరుత సంచారం

రాయదుర్గం పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డు చెక్‌పోస్టు వద్ద ఉన్న కొండపై చిరుత శుక్రవారం సాయంత్రం కలకలం రేపింది. దీంతో కాలనీవాసులు భయాందోళనకు లోనయ్యారు. కొండపై పెద్ద బండరాయి వద్ద అటు.. ఇటు.. తిరుగుతూ కనిపించింది. అటవీ అధికారులు.. చిరుతను బంధించి తరలించాలని కోరారు.

గ్రామంలోకి ఆలువ

గుమ్మఘట్ట మండలంలోని తాళ్లకెర గ్రామంలోని మాల వీధిలోకి గురువారం రాత్రి వన్యప్రాణి ఆలువ వచ్చింది. మాల రామాంజనేయులు ఇంట్లోకి రాగా.. కుటుంబసభ్యులు పట్టుకున్నారు. గంప కింద ఉంచారు. శుక్రవారం రెవెన్యూ అధికారుల సాయంతో అటవీశాఖ అధికారి దామోదర్‌రెడ్డికి అప్పగించారు. పుట్టపర్తి అటవీ ప్రాంతంలో వదలి పెట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రామాంజనేయులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

స్వామీ.. నారాయణా..!

- వెలుగులోకి సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి అక్రమాలు
- లంచమే ధ్యేయంగా రిజిస్ట్రేషన్లు
- వేరే పట్టణాలవి సైతం 'దుర్గం'లోనే రిజిస్ట్రేషన్
- ఇంకా కొనసాగుతున్న ఏసీబీ సోదాలు

కళ్యాణదుర్గం/రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఏసీబీ అధికారులకు పట్టుబడిన సబ్‌రిజిస్ట్రార్ నారాయణస్వామి అవినీతి కార్యకలాపాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. తకరారు ఉన్న భూములనే టార్గెట్ చేసి, ఇక్కడే రిజిస్ట్రేషన్ చేయించి లక్షల్లో డబ్బులు గుంజినట్లు వినిపిస్తోంది. ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి, ఏసీబీ సీఐ అమీద్‌ఖాన్, సిబ్బంది ఉమేశ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నుంచి కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోదాలు కొనసాగుతున్నాయి. గత ఏడాది డిసెంబరులో కళ్యాణదుర్గం ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా నారాయణ స్వామి బాధ్యతలు తీసుకున్నాడు. అప్పటి నుంచి జూలై 24 వరకు చేసిన రిజిస్ట్రేషన్‌కు సంబంధించి రికార్డులన్నీ వారు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అయితే ఏసీబీ అధికారులు వివరాలు వెల్లడించడం లేదు.



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొనసాగుతున్న ఏసీబీ అధికారుల సోదాలు

తకరారు భూములకు ఇక్కడే రిజిస్ట్రేషన్

అనంతపురం, రాప్తాడు, కాళహస్తి, తిరుపతి, విజయవాడ, రాయ దుర్గం, బుక్కపట్నం, ధర్మవరం తదితర ప్రాంతాలకు చెందిన తకరారు భూములన్నింటికీ ఇక్కడే రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో సమస్యలున్న భూములు, కోర్టు వివాదంలో ఉన్న భూములను ఎక్కువభాగం ఇక్కడే రిజిస్ట్రేషన్ చేయించారన్న వాదనలు ఉన్నాయి. తకరారు ఉన్న భూములన్నీ రెండు, మూడు రోజుల్లోనే రిజిస్ట్రేషన్ చేయించి, మధ్యవర్తుల ద్వారా లక్షల్లో డబ్బులు గుంజారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటివి కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వేదికగా వందల్లో జరిగినట్లు సమాచారం. ఇలాంటివన్నీ సోదాల్లో బయట పడుతుండటంతో ఏసీబీ అధికారులే విస్తుపోతున్నారు. ఇతర ప్రాంతాల భూములను ఎందుకు ఇక్కడే రిజిస్ట్రేషన్ చేశారన్న కోణంలో వివరాలు సేకరించే పనిలో ఏసీబీ అధికారులు నిమగ్నం అయినట్లు తెలిసింది.

బాధితుడి భూమి కూడా అనంతపురంలో రిజిస్ట్రేషన్ చేయించారు

ఏసీబీకి పట్టించిన నాగేంద్రనాయక్‌ను సబ్‌రిజిస్ట్రార్ నారాయణస్వామి కళ్యాణదుర్గం కార్యాలయం చుట్టూ 20 రోజులు తిప్పుకున్నాడు. దీంతో విసుగు చెందిన ఆయన ఏసీబీని ఆశ్రయించి పట్టించినట్లు తెలిసింది. కళ్యాణదుర్గం మండలం నుసికొట్టాల తండాకు చెందిన నాగేంద్ర నాయక్ అనంతపురంలో నివాసం ఉంటున్నాడు. 252 సర్వేనెంబర్‌లో కళ్యాణదుర్గం మండలం ఒంటిమిద్దె ప్రాంతం వద్ద 1.5 ఎకరా భూమి ఉంది. ఈ భూమి అంతా అగ్రికల్చర్ ల్యాండ్ కింద వెబ్‌ల్యాండ్‌లో నమోదైంది. రిజిస్ట్రేషన్ చేయాలని సబ్‌రిజిస్ట్రార్ నారాయణస్వామిని సంప్రదించాడు. అయితే ఈ భూమి నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ కింద ఉందని, గజాల్లోకి విలువ కట్టి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచిం చారు. ఈ నేపథ్యంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కొన్ని రోజుల తర్వాత వారిద్దరి మధ్య రాజీ ఒప్పందం కుదిరింది. ఈక్రమంలోనే అనంతపురం రామ్‌నగర్‌లో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ నెల 17న రిజిస్ట్రేషన్ చేయించాడు. రూ. ఏడు లక్షలకు బేరం కుదుర్చుకుని, రూ. 5లక్షలు ఇచ్చాడు. బాధితుడి ఫిర్యాదుతో ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఇలా వివాదం ఉన్న భూములన్నీ కళ్యాణదుర్గం కేంద్రంగా రిజిస్ట్రేషన్ చేస్తే సమస్యలు ఉత్పన్నం అవుతాయని భావించి, తెలివిగా వేరే ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ చేయిస్తూ అక్రమాలకు పాల్పడ్డాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాగాఏసీబీ అధికారుల దాడులతో డాక్యుమెంట్ రైటర్ల కార్యాలయాలన్నీ బంద్ చేశారు.

ఆ అధికారి అవినీతిపై సమాచారం ఇవ్వండి

కళ్యాణదుర్గం సబ్ రిజిస్ట్రార్ నారాయణస్వామి అవినీతిపై సమాచారాన్ని ఇవ్వాలని ఏసీబీ డీఎస్పీ జెస్సీ ప్రశాంతి కోరారు. 9440446190 అనే నెంబర్‌కు సమాచారం అందించాలని, వివరాలు అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

ప్రమాద నివారణ చర్యలు చేపట్టండి

- ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశం

అనంతపురం కలెక్టరేట్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను పరిశీలించి, ప్రమాదాలకు కారణాలు తెలుసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో రోడ్డు భద్రత జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. రోడ్డు భద్రతపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆటోలు, ఇతర వాహనాలలో పరిమితికి మించి సరుకు రవాణా జరగకుండా అవగాహన కల్పించాలని, ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. పెండింగ్ ఉన్న జాతీయ రహదారుల పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. డ్రంకెన్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్ వెళ్లేవారిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో 15,157 మో టారు వాహన కేసులు నమోదు చేశామని, రూ.20,44,095 జరిమానా విధించామని డీటీసీ వీర్రాజు తెలిపారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ మురళీకృష్ణ, ఆర్టీసీ ఆర్ఎం సుమంత్, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆ మూడింటిపై..

ప్రతి నెలా ఎఫ్‌పీ షాపులు, పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలను తనిఖీ చేసి, ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని అధికారులను ఇన్‌చార్జి కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సీఎస్‌డీటీలు, ఎంఈఓలతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో 65 సంవత్సరాలు పైబడిన వారికి, దివ్యాంగులకు, మంచానికే పరిమితమైనవారికి ఇంటివద్దకే వెళ్లి రేషన్ సరుకులను పంపిణీ చేసే ప్రక్రియను సకాలంలో 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు.

డీడీగా వెంకటేష్

అనంతపురం అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీగా వెంకటేష్ నియమితులయ్యారు. హిందూపురం వెటర్నరీ పాలీ క్లినిక్‌లో డీడీగా పనిచేస్తున్న ఆయన్ను ఫారిన్ సర్వీస్ కింద అనంత జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ డీడీగా నియమించారు. మరో మూడు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

డ్రిప్ మంజూరుపై దృష్టి పెట్టండి

అనంతపురం అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుపై దృష్టి సారించాలని ఉద్యాన శాఖ కమిషనర్ శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం విజయవాడ నుంచి ఏపీఎంఐపీ రాష్ట్ర అధికారి వెంకటేశ్వర్లుతో కలిసి అన్ని జిల్లాల పీడీలు, ఏపీడీలు, డ్రిప్ కంపెనీల ప్రతినిధులతో ఆయన జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. గతేడాది పెండింగ్ పడిన డ్రిప్ పరికరాల సరఫరా, తుది పరిశీలన ప్రక్రియను నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 18వేల హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల మంజూరు లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళికబద్ధంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్ రెడ్డి, ఏపీడీ ధనుంజయ, డ్రిప్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.


విద్యార్థుల సంఖ్య పెంచండి: డీడీ

అనంతపురం విద్య, జూలై 25(ఆంధ్రజ్యోతి): వసతి గృహాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని వార్డెన్‌లను బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారి ఆదేశించారు. విద్యార్థులు లేక చాలా వసతి గృహాలు మూసివేసే పరిస్థితి ఏర్పడుతోంది. దీనిపై 'సంక్షోభ హాస్టళ్లు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. జిల్లాలో 21 వార్డెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉన్నతాధికారులను కోరినట్లు ఆమె తెలిపారు.

రక్షణ కల్పించండి

- ఎస్పీకి ప్రేమజంట వినతి

అనంతపురం క్రైం, జూలై25(ఆంధ్రజ్యోతి): తాము ప్రేమించి పెళ్లి చేసుకున్నామనీ, రక్షణ కల్పించాలని ప్రేమజంట.. ఎస్పీకి విన్నవించుకుంది. విడపనకల్లు మండలం పాల్తూరుకు చెందిన ఎర్రిస్వామి(24), మల్లాపురానికి చెందిన గౌతమి(22) శుక్రవారం ఎస్పీ జగదీష్‌ను కలవడానికి జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు... శివప్ప, సుంకులమ్మ దంపతుల కుమారుడు ఎర్రిస్వామి ఇంటర్ వరకూ చదువుకుని వ్యవసాయం చేస్తున్నాడు. మల్లాపురం గ్రామానికి చెందిన గోవిందు, వన్నూరమ్మ దంపతుల కుమార్తె గౌతమి డిగ్రీ వరకూ చదువుకుంది. ఇద్దరూ ఏడాదిన్నరగా ప్రేమించుకున్నారు. గౌతమికి కుటుంబీకులు ఇటీవల పెళ్లి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రేమికులు ఈనెల 24న ఇళ్ల నుంచి వెళ్లిపోయారు. కర్ణాటకలోని ఓ దేవాలయంలో శుక్రవారం పెళ్లి చేసుకున్నారు. విషయం తెలుసుకున్న వధువు తల్లిదండ్రులు, బంధువులు.. పాల్తూరికి వెళ్లారు. ఎర్రిస్వామి తండ్రి శివప్పను ఊరిలోని గుడి వద్దకు తీసుకెళ్లి గురువారం రాత్రి చెట్టుకు కట్టేసి కొట్టారు. ఊరి పెద్దలు వారించడంతో విడిచిపెట్టారు. విషయం తెలుసుకున్న ప్రేమ జంట శుక్రవారం ఉదయం నేరుగా అనంతపురం ఎస్పీ కార్యాలయానికి వచ్చింది. ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ... తాము ఇష్టపూర్వకంగానే పెళ్లి చేసుకున్నామన్నారు. గౌతమి కుటుంబీకుల నుంచి ప్రాణహాని ఉందనీ, రక్షణ కోరేందుకు వచ్చామని వివరించారు. తర్వాత ఎస్పీ జగదీష్‌ను కలిసి సమస్యను తెలియజేసి, వినతిపత్రం అందించారు.



మీడియాతో మాట్లాడుతున్న ప్రేమజంట



రాగులపాడు వద్ద హంద్రీనీవాలోకి నీటి పంపింగ్

ఆరు మోటార్లతో ఎత్తిపోత

- జీడిపల్లికి వడివడిగా కృష్ణా జలాలు

ఉరవకొండ/బెళుగుప్ప, జూలై 25(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని రాగులపాడు 8వ పంప్‌హౌస్ నుంచి ఆరు మోటార్లతో కృష్ణా జలాలను హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా జీడిపల్లికి ఎత్తి పోస్తున్నారు. రాగులపాడు పంప్‌హౌస్‌కు ఈ నెల 22న నీరు చేరింది. దీంతో అధికారులు మూడు మోటార్లను ఆన్‌చేసి నీటిని ఎత్తిపోసిన విషయం తెలిసిందే. రెండు రోజుల నుంచి రాగులపాడు వద్ద ఆరు మోటార్లతో ఎత్తిపోతను ప్రారంభించారు. దీంతో జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 1012 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో నీటి నిల్వ 1.07 టీఎంసీలు ఉన్నట్లు వెల్లడించారు. ఈ నెలాఖరులోపు జీడిపల్లి రిజర్వాయర్‌ను నింపి, అక్కడి నుంచి పీఏబీఆర్, ఎంపీఆర్ డ్యాంకు నీటిని విడుదల చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మరింత బాధ్యతగా పనిచేయండి

- ఉద్యోగోన్నతి ఎస్ఐలకు ఎస్పీ దిశానిర్దేశం



ఎస్పీని కలిసిన కొత్త ఎస్ఐలు

అనంతపురం క్రైం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉద్యోగోన్నతి పొందినవారు మరింత బాధ్యతగా పనిచేయాలని ఎస్పీ జగదీష్ సూచించారు. 1990 బ్యాచ్‌కు చెందిన 24 మంది ఏఎస్ఐలకు ర్యాంక్ ప్రమోటీ ఎస్ఐలుగా ప్రమోషన్ ఇవ్వడంతో వారు శుక్రవారం డీపీఓలో ఎస్పీ జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ మాట్లాడుతూ... ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు త్రిలోక్‌నాథ్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు వర్ష సూచన

బుక్కరాయసముద్రం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు రానున్న ఐదు రోజుల్లో తేలికపాటి లేదా ఓ మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. పలు చోట్ల తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 31-33.8 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.9-24.5 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చన్నారు. నైరుతి దిశగా గాలులు గంటకు 6కి.మీవేగంతో వీచే అవకాశముందన్నారు. గాలిలో తేమ ఉదయం పూట 63-80, మధ్యాహ్నం పూట 48-72 నమోదు అయ్యే అవకాశం ఉందన్నారు. అనంతపురం జిల్లాలో 26న 1.2 మి.మీ, 27న 0.4 మి.మీ 28న 0.6 మి.మీ, 29న 0.2 మి.మీ 30న 0.4మి.మీ కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 26న 0.7 మి.మీ, 27న 0.4 మి.మీ 28న 0.6 మి.మీ, 29న 0.2 మి.మీ 30న 0.4మి.మీ కురిసే అవకాశం ఉందన్నారు.

టమోటా కిలో రూ.34

అనంతపురం రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో శుక్రవారం కిలో టామోటాలు గరిష్టంగా రూ.34 ధర పలికినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్టంగా రూ.17, సరాసరిగా రూ.27తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,700 టన్నుల టమోటాలు వచ్చినట్లు చెప్పారు.

రైలు పాక్షిక రద్దు

గుంతకల్లు, జూలై 25(ఆంధ్రజ్యోతి): అనంతపురం, గుత్తి మీదుగా వెళ్లే యశ్వంతపూర్-లక్నో వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను రెండు నెలలపాటు పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉత్తర రైల్వేలోని లక్నో రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫాం వర్కుల కారణంగా ఈ రైలును లక్నో వరకూ కాకుండా అంత్రేటియా స్టేషన్ వరకే నడపనున్నట్లు తెలిపారు. యశ్వంతపూర్-లక్నో ఎక్స్‌ప్రెస్ (నం. 22683)ను ఆగస్టు 4, 11, 18, 25, సెప్టెంబరు 1, 8, 15, 22 తేదీల్లో అంత్రేటియా వరకూ మాత్రమే నడపనున్నామన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 22684) ఆగస్టు 7, 14, 21, 28, సెప్టెంబరు 4, 11, 18, 25 తేదీల్లో లక్నో నుంచి కాకుండా అంత్రేటియా నుంచి ప్రారంభం అవుతుందన్నారు.

న్యూస్ బాక్స్

శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీకి సన్మానం


ట్రైనీ డీఎస్పీని సన్మానిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): శిక్షణ కాలం పూర్తి చేసుకున్న ట్రైనీ డీఎస్పీ ఉదయ్‌పావనిని ఎస్పీ వి. రత్న శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శిక్షణ కాలంలో ధర్మవరం, కదిరి, మడకశిర, నల్లమాడ, అమడగూరు మండలాల్లో ఆమె పలు కీలక కేసులను పరిష్కరించినట్లు చెప్పారు. సమర్థవంతంగా విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. తాను శిక్షణ సమయంలో పరిష్కరించిన కేసుల ద్వారా క్షేత్రస్థాయిలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఆర్‌ఐ వలీ, సిబ్బంది మహేష్, మోహన్, వెంకటేశ్వర్లు, వీరన్న, సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమం: ఎమ్మెల్యే

బుక్కపట్నం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మారాల పంచాయతీలో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆమె ఇంటింటా తిరుగుతూ సంక్షేమ పథకలు, అభివృద్ధిని వివరిస్తూ.. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమెతోపాటు టీడీపీ నాయకులు చింతా మల్లిరెడ్డి, అప్పస్వామినాయుడు, ప్రభాకర్‌రెడ్డి, గంగాధర్, క్రిష్టప్ప, రామానాయుడు, లావణ్యగౌడ్ పాల్గొన్నారు.

సింగిల్‌విండో అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం

గాండ్లపెంట, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా రామాంజులరెడ్డి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరయ్యారు. సహకార సంఘం బలోపేతానికి కృషిచేస్తామని డైరెక్టర్లు, అధ్యక్షుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో సహకారసంఘం సీఈఓ షామీర్, డైరెక్టర్ మునాఫ్, వెంకటరమణారెడ్డి, శివప్పనాయుడు, నరసింహులు, అక్రమ్‌బాషా, ఆనంద్ పాల్గొన్నారు.

అధికారులు సమయ పాలన పాటించాలి

నల్లచెరువు, జూలై 25(ఆంధ్రజ్యోతి): అధికారులు సమయ పాలన పాటించాలని ఎంపీపీ రమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్యసమావేశానికి నిర్ణీత సమయంలో అధికారులు హాజరుకాకపోవడంతో ఆయన ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తపై మండిపడ్డారు. సర్వసభ్యసమావేశం ప్రారంభమై గంట గడుస్తున్నా అధికారులు వస్తూనే ఉండడం ఏమిటని ప్రశ్నించారు. మూడునెలలకు ఒకసారి నిర్వహించే సమావేశానికి తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. వైస్ ఎంపీపీ నారాయణస్వామి అంగన్‌వాడీ కేంద్రాలకు మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. తహసీల్దార్ జమానుల్లాఖాన్ మాట్లాడుతూ.. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని అన్నారు. సమస్యల పరిష్కారానికి తనను సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

కేబుల్ దొంగల అరెస్ట్

కదిరి, జూలై 25(ఆంధ్రజ్యోతి): తలుపుల మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మోటారు కేబుల్ చోరీకి పాల్పడిన ము గ్గురు దొంగలను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు. తలుపుల సమీపంలోని ఆంజనేయస్వామి గుడిపక్కన చోరీలకు పాల్పడిన ముగ్గురు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం వచ్చిందన్నారు. సిబ్బందితో వెళ్లి తలుపులకు చెందిన అమీనుల్లా, షర్ఫోద్దీన్‌తోపాటు మరోబాలుడిని అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. వీరు ముగ్గురు కలిసి ఈనెల 17న టి.రెడ్డివారిపల్లి సమీపంలోని మామిడి తోపులోనూ, 19న వేపమానిపేట దగ్గరలోని పొలంలో, 20న మాడికవాండ్లపల్లి వద్ద ఉన్న పొలంలో, 21న పెద్దపల్లి, 23న తురకవాండ్లపల్లిలో ఉన్న పొలాల్లో బోర్లకు అమర్చిన మోటారు వైరును రెండువైపుల రాయితో కొట్టి తెచ్చినట్లు చెప్పారు. ఆ వైరును ఓ గుర్తు తెలియని గుజరీ వ్యాపారికి వి క్రయించగా రూ.లక్ష 50వేలు వచ్చిందన్నారు. అనంతరం వారి వద్దనుంచి ఆ సొమ్మును రికవరీ చేసినట్లు తెలిపారు.

'బదిలీలో అన్యాయం'

పుట్టపర్తి టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): తనకు అత్యధిక రోస్టర్ పాయింట్లు ఉన్నా, అధికారులు ఉద్దేశ్యపూర్వకంగా అన్యాయం చేశారని యల్లనూరు కేజీబీవీ పీఈటీ ఈశ్వరమ్మ శుక్రవారం కలెక్టర్ టీఎస్ చేతన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనకు 36 రోస్టర్ పాయింట్ల మేరకు బత్తలపల్లికి బదిలీ చేశారని అన్నారు. తరువాతన తన బదిలీని రద్దు చేసి, 18 రోస్టర్ పాయింట్లతో ఉన్న ముదిగుబ్బ కేజీబీవీ పీఈటీని బత్తలపల్లికి బదిలీ చేశారని తెలిపారు. అధికారులు తనకు ఉద్దేశ్యపూర్వకంగా అన్యాయం చేశారని ఆవేదన చెందారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ విచారణచేసి చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

ధర్మవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): సచివాలయానికి ప్రజలు తీసుకువచ్చే ప్రతి సమస్యను తక్షణమే పరిష్కరించాలని 25వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సచివాలయంలో సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లతో ఆయన సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా భీమనేని ప్రసాద్‌నాయుడు మాట్లాడుతూ.... వార్డులో ప్రజలు సమస్యలు తెలిపిన వెంటనే పరిష్కరించాలని, వారిని సచివాలయం చుట్టూ తిప్పుకోరాదన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజి తదితరులు పాల్గొన్నారు.

ఏడీఏ క్రిష్ణయ్య సేవలు స్ఫూర్తిదాయకం


ఏడీఏ క్రిష్ణయ్యను సత్కరిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

ధర్మవరంరూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ డివిజన్ అధికారి క్రిష్ణయ్య సేవలు స్ఫూర్తిదాయకమని ఏడీఏ లక్ష్మానాయక్ కొనియాడారు. క్రిష్ణయ్య హిందూపురం డివిజన్‌కు బదిలీ కావడంతో శుక్రవారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో డివిజన్‌లోని వ్యవసాయ సిబ్బంది, ఎరువుల దుకాణాల యాజమానులు ఘనంగా సన్మానించారు. ఆయనతో పాటు బదిలీపై వెళ్లిన వ్యవసాయ అధికారులు కృష్ణకుమారి, రమాదేవి, ఉదయ్‌కుమార్, గ్రామ వ్యవసాయ, హార్టికల్చర్ సిబ్బందిని సన్మానించారు. అనంతరం ఏడీఏ లక్ష్మానాయక్ మాట్లాడుతూ.. ధర్మవరం డివిజన్‌లో క్రి ష్ణయ్య రైతులకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ధర్మవరం ఏఓ ముస్తఫా, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా విత్తనం

● పదును వర్షంతో ఉత్సాహం
● వేరుశనగ, కంది వేస్తున్న రైతులు

ధర్మవరంరూరల్, జూలై25(ఆంధ్రజ్యోతి): వర్షం కోసం నెల రోజులుగా ఎదురు చూస్తున్న రైతులకు కొంత ఊరట లభించింది. రెండు రోజుల క్రితం పదును వర్షం పడడంతో ఆలస్యం చేయకుండా విత్తన సాగుకు సిద్ధమయ్యారు. అదును దాటిపోతుందనే ఆందోళనతో ధర్మవరం మండలంలోని పలు గ్రామాల రైతులు వేరుశనగ, కంది విత్తనాలు సాగు చేస్తున్నారు. రైతులు తమ పొలాల్లో విత్తనసాగు పనిలో బిజీబిజీగా గడుపుతున్నారు. మండలంలోని వసంతపురం, చింతలపల్లి, గరుడంపల్లి, చిగిచెర్ల, బడన్నపల్లి, గొట్లూరు, తుమ్మల, తిప్పేపల్లి, ఉప్పునేసినపల్లి గ్రామాల్లో వేరుశనగ, కందిసాగు చేస్తున్నారు. ఎద్దులు, ట్రాక్టర్లతో విత్తనం సాగు చేస్తూ బిజీబిజీ ఉన్నారు. ఇప్పటికే ఆరుద్ర కార్తె ముగిసి పునర్వసు కార్తె రావడంతో అదును దాటిపోతోందని సాగుచేస్తున్నారు.


వసంతపురం వద్ద వేరుశనగ విత్తుతున్న రైతులు

రోడ్లు గుంతలమయం.. ప్రయాణం నరకప్రాయం

ఓబుళదేవరచెరువు, జూలై 25(ఆంధ్రజ్యోతి): కొద్దిపాటి వర్షం వస్తే చాలు కదిరి-హిందూపురం ప్రధాన రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. పెద్దపెద్ద గుంతలు ఏర్పడడంతో అందులో నీరు నిలుస్తోంది. దీంతో వాహనదారులు గుంత ఉందన్న విషయం ఆదమరిస్తే మాత్రం ప్రమాదం తప్పడంలేదు. ఈ రహదారి వడ్డివారిపల్లి, తహసీల్దార్ కార్యాలయం వద్ద, హోండాషోరూమ్, హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం వద్ద, ఇలా చాలాచోట్ల తరచూ దెబ్బతినడంతో రోజుకు ఒకరిద్దరు పడిలేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి దెబ్బదిన్న రహదారులను మరమ్మతులు చేసి, ప్రమాదాలను అరకట్టాలని ప్రజలు కోరుతున్నారు.


కదిరి-హిందూపురం రహదారిపై పెద్ద గుంత, హీరోహోండా షోరూమ్ వద్ద దెబ్బతిన్న ప్రధాన రహదారి

ఉత్సాహంగా క్రీడాపోటీలు

ధర్మవరంరూరల్, జూలై25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీటీ మైదానంలో శుక్రవారం నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. శుక్రవారం స్కూల్‌టోర్నమెంట్ -సీజన్3లో కబడ్డీ, క్రికెట్ పోటీల్లో సత్తాచాటి విజేతలుగా నిలిచారు. ముఖ్య అతిథిగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీ‌ష్‌బాబు హాజరై మ్యాచ్‌లను ప్రారంభించారు. కబడ్డీ బాలికల విభాగంలో కొత్తపేట మున్సిపల్ హైస్కూల్, కేజీబీవీ మోటుమర్ల విద్యార్థినులు తలపడగా.. విజేతగా మున్సిపల్‌హైస్కూల్ విద్యార్థులు, రన్నర్‌గా మోటుమర్ల కేజీబీవీ విద్యార్థినులు నిలిచారు. బాలుర విభాగంలో ఎస్సీసీఎస్ రైల్వేస్కూల్ కొత్తపేట జట్టు విజేతగా, రన్నర్‌గా గొట్లూరు జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల నిలిచింది. క్రికెట్‌పోటీల్లో బాలికల విభాగంలో మున్సిపల్ స్కూల్ కొత్తపేట విజేతగా, ఏపీ మోడల్ స్కూల్ రన్నరప్‌గా నిలిచింది. బాలుర విభాగంలో ఎస్సీసీఎస్ రైల్వేస్కూల్ విజేతగా, మెడల్‌స్కూల్ రన్నరప్‌గా నిలిచాయి. వీరికి కప్‌లు, షీల్డులను హరీ‌ష్‌బాబు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగిఉన్న క్రీడానైపుణ్యాలు వెలికితీసేందుకు ఈ తరహాపోటీలు ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాంప్రసాద్, వివిధ పాఠశాలల పీడీలు, కోచ్‌లు రాజశేఖర్, పృథ్వీ అనిల్, బీజేపీ నాయకులు చంద్ర, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.


విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్నహరీ‌ష్‌బాబు

పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మతల్లి, ఆంజనేయస్వామి

ధర్మవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాలె వీధిలో వెలసిన పెద్దమ్మతల్లికి శ్రావణ మాస తొలి శుక్రవారం ఆలయ అర్చకుడు వెంకటేశ్శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని తమలపాకులతో అలంకరించారు. కార్యక్రమాలు బుగ్గవంశస్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. లింగిశెట్టి పాళ్యం అభయ ఆంజనేయస్వామి ఆలయం లో శ్రావణ తొలి శుక్రవారం పూజలు నిర్వహించారు. స్వామికి తమలపాకులు, తులసి ఆకులతో ప్రత్యేకంగా అలంకరించారు. పంచామృతాభిషేకం, వెండికవచం సమర్పించారు.

జాతీయ అవార్డు గ్రహీతకు సన్మానం

ధర్మవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన చేనేత కళాకారుడు, ప్రముఖ డిజైనర్ నాగరాజుకు జాతీయ స్థాయి అవార్డు ప్రకటించిన సందర్భంగా రజని ట్రస్టు, రక్తబంధం ట్రస్టు సభ్యులు సన్మానించారు. శుక్రవారం ట్రస్టు సభ్యులు కన్నా వెంకటేశ్, చిప్పల చంద్రశేఖర్, ఉదయ్‌కుమార్, కౌన్సిలర్ కేతాలోకేశ్ నాగరాజు ఇంటికి వెళ్లి శాలువా కప్పి సత్కరించారు. నాగరాజు జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికై జిల్లాకు, ధర్మవరానికి పేరుప్రతిష్టలు తీసుకువచ్చారని కొనియాడారు.


నాగరాజును సన్మానిస్తున్న దృశ్యం

జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

నల్లమాడ, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఈనెల 31న ధర్మవరంలో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సీపీఐ కాలనీలో పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. సీపీఐ రాష్ట్ర నాయకులు మహాసభలకు హాజరవుతారన్నారు. మండలంలోని కార్మికులు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి వెంకటరమణ, నాయకులు నాగేంద్ర, గంగాధర్ పాల్గొన్నారు.

స్థల వివాదం.. వ్యక్తిపై దాడి

ధర్మవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): స్థలం వివాదంలో తలదూర్చుతున్నాడంటూ సూర్యనారాయణరెడ్డిపై తన అన్న చంద్రశేఖర్‌రెడ్డి, ఆయన అల్లుడు భరత్‌రెడ్డి దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో సూర్యనారాయణరెడ్డి టూటౌన్ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు చంద్రశేఖర్‌రెడ్డి, ఆయన అల్లుడు భరత్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

హంద్రీనీవా కాలువ వద్ద వ్యక్తి మృతి

కదిరి అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కదిరి మండలంలోని ఎర్రదొడ్డి సమీపంలో హంద్రీనీవా కాలువ వద్ద మహారాష్ట్రలోని కొల్హాపూర్ జిల్లాకు చెందిన ఏకనాథ్ సత్యప్ప (48) శుక్రవారం మృతి చెందాడు. అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన మేరకు.. ఏకనాథ్ సత్యప్ప వారం కిందట హంద్రీనీవా బ్రోజర్ ఆపరేటర్‌గా వచ్చాడు. గురువారం రాత్రి భోజనం చేసి, షెడ్‌లో పడకున్నట్లు తోటి కార్మికులు చెప్పారు. తెల్లవారిన తరువాత అక్కడ పనిచేసే కూలీలు లేపగా లేవకపోవడంతో చనిపోయినట్లు నిర్ధారించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మృతుడు సత్యప్ప

హంద్రీనీవా పనులను అడ్డుకున్న ప్రజాసంఘాలు


ఉస్తిలిపల్లి వద్ద పనులను అడ్డుకుంటున్న ప్రజాసంఘాల నాయకులు

తనకల్లు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉస్తిలిపల్లి వద్ద శుక్రవారం హంద్రీనీవా కాలువ పనులను ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. కాలువలకు సిమెంట్ లైనింగ్ చేస్తుండడంతో.. ఉస్తిలిపల్లికి చెందిన రైతులు, వైసీపీ, సీపీఐ, సీపీఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో పనులు అడ్డుకుని నిలిపివేశారు. గతంలో ప్రభుత్వం తీసుకున్న భూముల్లోనేకాకుండా అదనంగా ఆక్రమిస్తున్నట్లు చెప్పారు. హంద్రీనీవా కాలువ మోరీల వద్ద పశువులు, మనుషులు కాలువలోకి దిగడానికి మెట్లు ఏర్పాటు చేయాలని కోరగా.. అప్పట్లో ఒప్పుకున్న కాంట్రాక్టర్ తరువాత ఇష్టమొచ్చినట్లు పనులుచేస్తున్నారని అన్నారు. ఉస్తిలిపల్లి వద్ద నుంచి హంద్రీనీవా కాలువ గట్టుపైన రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరినా పట్టించుకోకపోవడంతో కాలువ పనులను అడ్డుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివన్న, రెడ్డెప్ప, రమణ, అరుణ, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

ఓబుళదేవరచెరువు, జూలై25(ఆంధ్రజ్యోతి): రికార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎంపీఐ ప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని నారప్పగారిపల్లి క్రాస్, గాజుకుంటపల్లి, మహమ్మదాబాద్‌క్రాస్ తదితర ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల కండీషన్, ఇన్సూరెన్స్ లైసెన్సులేని ఐదు వాహనాలకు రూ.40వేలు ఆపరాధ రుసం వేసినట్లు తెలిపారు. ఇందులో మూడు ఆటోలు, ఒక కారు, ఒక గూడ్స్ వాహనం ఉన్నాయని వివరించారు. వాహనదారులు రికార్డులు తప్పకుండా వెంట తెచ్చుకోవాలని ఆయన తెలిపారు.

వసతి గృహాలను తనిఖీ చేసిన అధికారులు

నంబులపూలకుంట, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మమ్మమర్రిమాను, మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాలను శుక్రవారం తహసీల్దార్ దేవేంద్రనాయక్ తనిఖీ చేశారు. ఉదయం అల్పాహారం తినే సమయంలో తిమ్మమ్మ మర్రిమాను బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. తాగునీటి సమస్యతోపాటు మరుగుదొడ్లు వినియోగంలో లేవన్నారు. వసతి గృహానికి పక్కనే ఉన్న ఆరుబయటకు వెళుతున్నట్లు పిల్లలు తెలిపారు. హాస్టల్‌లోనే మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీటి సౌకర్యం కల్పించాలని తెలిపారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతిగృహంలో విద్యార్థుల సంఖ్యతక్కువగా ఉందన్నారు.

● ముదిగుబ్బ : మండల పరిధిలోని ఎనుములవారిపల్లి బాలుర బీసీ హాస్టల్‌ను డీఎల్‌పీఓ శివకుమారి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, వసతులు, ఆహార నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పరిశుభ్రతను తప్పకుండా పాటించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దివాకర్, పంచాయతీ కార్యదర్శి బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

● ధర్మవరంరూరల్: పట్టణంలోని దుర్గానగర్‌లో ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల వసతిగృహాన్ని తహసీల్దార్ సురేష్‌బాబు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికలతో ఆయన వసతులపై ఆరాతీశారు. వసతి గదుల్లో మరుగుదొడ్లు, భోజనం చేసే వద్ద అపరిశుభ్రత లేకుండా చూడాలని వార్డెన్ లతకు సూచించారు. వసతి గృహంలో ఉన్న సీసీ కెమెరాలు పనిచేయడం లేదని తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. స్టోర్‌రూమ్‌లో ఉన్న బియ్యాన్ని, వంటసరుకులను పరిశీలించారు. ఆయన వెంట వీఆర్‌ఓ రవిశేఖర్‌రెడ్డి ఉన్నారు.


నంబులపూలకుంట మండలం తిమ్మమ్మ మర్రిమాను, ధర్మవరంలో పరిశీలిస్తున్న తహసీల్దార్లు, ముదిగుబ్బలో డీఎల్‌పీఓ..

వైసీపీ పాలనలో రాష్ట్రం నాశనం: కందికుంట


రచ్చబండలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

గాండ్లపెంట, జూలై25 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, రాష్ట్ర నాశనమయిందని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని సోమయాజులపల్లి పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ సాధ్యమవుతున్నాయని అన్నారు. వైసీపీ నేత జగన్‌రెడ్డి ఒక్కఛాన్స్ అంటూ ప్రజలను నిండా ముంచారని తెలిపారు. తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిపనులను వివరించారు. ఉచిత ఇసుక, యేడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు, పింఛన్లు, తల్లికి వందనం పథకాలను తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఫర్వీన్‌బాను, కొండయ్య, ఎంపీపీ సోముశేఖర్‌రెడ్డి, సింగల్‌విండో మాజీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, సర్పంచ్ శివప్పనాయుడు, ప్రసాద్, అక్రమ్, చంద్ర పాల్గొన్నారు.

చిగిచెర్లలో కేంద్ర బృందం పర్యటన


చిగిచెర్లలో చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్రబృంద సభ్యులు

ధర్మవరంరూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛసర్వేక్షన్ గ్రామీణ్-2025లో భాగంగా కేంద్ర బృంద సభ్యులు శుక్రవారం మండలంలోని చిగిచెర్ల గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని జడ్పీహైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ సచివాలయం, చెత్త సేకరణ సంపద కేంద్రం, ఆరోగ్య ఉపకేంద్రం, గ్రామంలో ఉన్న గృహాలు, మరుగుదొడ్లు, మంచినీటి వసతి, పరిసరాల పరిశుభ్రత, గోకులంషెడ్లు, మురుగునీటి వనరులను ప్రత్యక్షంగా పరిశీలించా రు. గ్రామంలో పరిశుభ్రత, కనీస అవసరాలకు సంబంధించి వసతులపై ప్ర జలతో ఆరాతీశారు. కార్యక్రమంలో కేంద్రబృంద సభ్యులు రామాంజనేయులు, జిల్లా ఎస్‌బీఎమ్ కోఆర్డినేటర్ అనంత, సాయినాథ్‌బాబు, ఎంపీడీఓ సాయిమనోహర్, డిప్యూటీ ఎంపీడీఓ వెంకటేష్, సర్పంచ్ బాబయ్య, కార్యదర్శి రెడ్డమ్మ, నాయకులు పార్థారెడ్డి, రాఘవరెడ్డి, చంద్రాయుడు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లో కలర్ డే


ఎల్లో డేలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ధర్మవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగలూరు వద్ద ఉన్న రూపారాజ పీసీఎంఆర్ పాఠశాలలో ఎల్లో కలర్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు పసుపు రంగు దుస్తులు ధరించి ఆకర్షణీయమైన రైమ్స్, నృత్య ప్రదర్శనలతో అలరించారు. వివిధ రకాల పసుపు పండ్లు, పసుపు కూరగాయల ప్రాధాన్యత, అవి ఆరోగ్యానికి చేసే మేలుగురించి వివరించారు. అనంతరం పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ మాట్లాడుతూ.. పసుపు రంగును సాధారణంగా ఆనందం, ఆశావాదం, శక్తికి చిహ్నంగా భావిస్తారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రూపరాజ కృష్ణ, జగదీశ్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేశ్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలపాటిదిన్నెలో ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ

నల్లచెరువు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి గాంచిన పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి వద్ద ఏర్పాట్లను డీఎస్పీ శివనారాయణస్వామి పరిశీలించారు. శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చే శారు. అనంతరం డీఎస్పీ మాట్లాడు తూ.. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. రూరల్ సీఐ నాగేంద్ర, ఎస్‌ఐ మగ్బుల్‌బాషా, ఆలయ ఈఓ మురళీక్రిష్ణ పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న డీఎస్పీ

గౌనిపల్లిలో కంటి వైద్య శిబిరం

ఓబుళదేవరచెరువు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌనిపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో శుక్రవారం పుట్టపర్తి పీస్‌వెల్ఫేర్ సొసైటీకి చెందిన డాక్టర్ బొగ్గు సురేష్ సహకారంతో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 300 మందికి పరీక్షలు చేయగా 20 మందికి కంటి అద్దాలకోసం సిఫార్సు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి మల్లె రమేష్, ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మల, ఎంఎల్‌హెచ్‌పీఓ వసుంధర, ఆరోగ్యసిబ్బంది ఇందిరమ్మ, ఉమా, సుశీలమ్మ, వైద్యసిబ్బంది షానవాజ్, సుధాకర్, మోహన్, స్రవంతి, జాస్మిన్ పాల్గొన్నారు.


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు

ధర్మవరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాలభైరవస్వామి ఆలయంలో అమావాస్య పూజలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో కూష్మాండ దీపోత్సవం సాగింది. పూజారి ధనుంజయ ఆచారి ఆధ్వర్యంలో స్వామిని విశేషంగా అలంకరించారు. అవామాస్య గడియల్లో ఆలయంలో దోషనివారణ పూజలు చేశారు. భైరవుని ఎదుట గుమ్మడికాయపై దీపాలు వెలిగించారు. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కంకధారణ కార్యక్రమం కూడా నిర్వహించారు.

పాఠ్యపుస్తకాలు చదివితే మంచి మార్కులు

కొత్తచెరువు, జూలై 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పాఠ్యపుస్తకాల్లోని పాఠాలను చదువుకుంటే మంచి మార్కులు సాధించవచ్చునని పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ తెలిపారు. మండలంలోని బండ్లపల్లి క్లస్టర్ పరిధిలోని పాఠశాలలను శుక్రవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాలాంజనేయులుతో కలసి ఆమె తనిఖీ చేశారు. యర్రపల్లి, బండ్లపల్లి ఆదర్శ పాఠశాల,హైస్కూల్ తరగతులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఉపాధ్యాయులు తరగతులకు సక్రమంగా హాజరవుతున్నారా..? పాఠాలు బాగా అని ఆరాతీశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాఠ్యపుస్తకాలను చదివించి వారి సామర్థ్యాన్ని పరీక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను, రాగిజావా, చిక్కీలు, విద్యాకిట్లను పరిశీలించారు. ఉపాధ్యాయులు పాఠాలను అర్థవంతంగా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ జయచంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

శాకంబరిగా వడిసలమ్మ



మడకశిర టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమరాపురం బస్టాండ్ ఆవరణలో వెలసిన వడిసలమ్మ అమ్మవారు శుక్రవారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసం మొదటి రోజు శుక్రవారం కావడంతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. రకరకాల కూరగాయలు, ఆకుకూరగాలతో విశేషాలంకరణ చేశారు. అమ్మవారికి దీపారాధన విశేష పూజలు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

వైభవంగా చౌడేశ్వరి అమ్మవారి జయంతి



బోనాలు మోస్తున్న మహిళలు

సోమందేపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పాతూరులో వెలసిన చౌడేశ్వరి అమ్మవారి జయంతిని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు డీసీ ఈశ్వరయ్య, తొగటవీరక్షత్రియ సంఘం అధ్యక్షుడు సీసీ హరి ఆధ్వర్యంలో వేడుకలు సాగాయి. ఉదయం మహిళలు బస్టాండులో వెలసిన పెద్దమ్మగుడి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం వెయ్యి బోనాలతో ఊరేగింపుగా పురవీధులగుండా బయలుదేరి వెళ్లారు. ఆలయం వద్ద ఏర్పాటుచేసిన కేక్‌ను కట్‌చేసి భక్తులకు పంచిపెట్టారు. అనంతరం బోనాలతో వచ్చిన మహిళలు వాటిని అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పసుపు, కుంకుమ అలంకరణలో రాజరాజేశ్వరి

హిందూపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం మొదటి శుక్రవారం పురస్కరించుకుని పులమతి రోడ్డులో వెలసిన రాజరాజేశ్వరి అమ్మవారికి పసుపు కుంకుమ అలంకరణ చేశారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని దర్శించుకున్నారు. శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో భాగంగా శుక్రవారం హిందూపురంలో సత్యసాయి ప్రేమప్రవాహిని రథోత్సవం నిర్వహించారు. మునిసిపల్ చైర్మన్ రమేష్ పాల్గొన్నారు. కంచికామాక్షి కల్యాణమండపం నుంచి సాయిసదన్‌వరకు రథోత్సవం సాగింది.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న చైర్మన్ రమేష్

హిందూపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడాయని మున్సిపల్ చైర్మన్ రమేష్, మాజీ చైర్మన్ అనీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంజీఎం క్రీడా మైదానంలో టీడీపీ నాయకుడు జబీవుల్లా ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ క్రీడలు ఆడటం జయాపజయాలకు కాదని దానిద్వారా ఐక్యత, క్రమశిక్షణ అలవడతాయన్నారు. నాయకులు ఫాజిల్, జబీ, అన్సార్, సాదిక్ పాల్గొన్నారు.

ప్రతి చెరువుకూ నీరిస్తాం: డీఈ



రైతులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ అధికారులు

పెనుకొండ రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా కాలువ ద్వారా ప్రతిచెరువుకు నీటిని అందించే దిశగా చర్యలు ప్రారంభిస్తున్నామని ఇరిగేషన్ డీఈలు గురుమూర్తి, రమణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అడదాకులపల్లి గ్రామంలో గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు వెళ్లే కాలువను పరిశీలించారు. కాలువల నుంచి చెరువులకు వచ్చే తూములు, లీకేజీలను తనిఖీ చేశారు. చివరి ఆయకట్టువరకు సాగునీటిని పరిశీలించారు. ఏఈ లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ ఈశ్వరప్రసాద్, ఆయకట్టు చైర్మన్ మారుతి, మంజునాథ్‌రెడ్డి, అంజినప్ప పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలు కొనసాగాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మడకశిర టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఆర్డీటీ సేవలు కొనసాగించాలని శుక్రవారం పట్టణంలో సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణం నుంచి పట్టణంలో అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. పేద విద్యార్థుల విద్యకు ఆర్డీటీ ఎంతో కృషి చేస్తోందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కేంద్రానికి రాసిన ఉత్తరాలు చేతిలో పట్టుకొని విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం పోస్టాఫీసు వద్ద ఆఫీసు వద్ద ఉన్న పోస్టు బాక్స్‌లో ఉత్తరాలు వేశారు. జీవిక సంస్థ ప్రతినిధులు యోగానంద, గోవింద పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

రొద్దం, జూలై 25(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని టింబక్టివ్ కలెక్టివ్ సొసైటీ నిర్వాహకులు బబ్లూ గంగూలి అన్నారు. శుక్రవారం స్థానిక అనంతశక్తి సొసైటీలో 28వ వార్షికోత్సవ మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అనంతశక్తి సొసైటీ క్రమశిక్షణకు మారుపేరుగా మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తోందన్నారు. సొసైటీ సీఈఓ లావణ్య, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుకన్య, మహిళలు పాల్గొన్నారు.

అన్నదానం

రొద్దం, జూలై 25(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులకు ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. శుక్రవారం మంత్రి సవిత ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు గర్భిణులకు అన్నం వడ్డించారు. మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య, వైద్యాధికారి సోమశేఖర్, డైరెక్టర్ తిరుపాల్‌నాయుడు, సిద్దన్న, ఉమాశంకర్, లింగప్ప, కిష్టప్ప, పాల్గొన్నారు.

మూలనపడ్డ స్వచ్ఛభారత్ సైకిళ్లు..!

- వన్నంపల్లిలో ఎటుచూసినా అపరిశుభ్రతే
- చెత్తదిబ్బలతో నిండిన పాఠశాల ఆవరణం
- పట్టించుకోని అధికారులు



వన్నంపల్లిలో చెత్త సేకరించే రిక్షాకు ఆవును కట్టేసిన దృశ్యం

పరిగి, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వన్నంపల్లి, శిరేకోళం పంచాయతీ పరిధిలో కొంతకాలంగా స్వచ్ఛభారత్ సైకిళ్ల మూలానపడ్డాయి. గ్రామంలోని వీధుల్లో ప్రజల నుంచి చెత్త సేకరించి రిక్షాల ద్వారా గ్రామం బయట డంప్‌చేయాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సచివాలయాలకు పంపిణీచేస్తే ఏదో ఒక మరమ్మతుల పేరుతో నిరుపయోగంగా పడి ఉన్నాయి. సంబంధిత అధికారుల నిర్లక్ష్యంతో మరమ్మతులు చేయించకపోవడంతో వన్నంపల్లి గ్రామంలో పశువులు కట్టేయడానికి వీటిని వినియోగిస్తున్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంతో దేశవ్యాప్తంగా పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తుంటే ఈ గ్రామంలో మాత్రం మురుగు కాలువలు, చెత్త దిబ్బలు పేరుకుపోయి అపరిశుభ్రంగా మారుతున్నాయి. ప్రాథమిక పాఠశాల పక్కనే చెత్తదిబ్బలు దర్శనమిస్తున్నారు. దీంతో విద్యార్థులు అనారోగ్యం బారినపడి ఆస్పత్రి పాలవుతున్నారు. సచివాలయం పక్కనే రిక్షా చెత్త దిబ్బతో నిండిపోయి కొన్నినెలలుగా ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ తుప్పుపట్టిపోతోంది. రిక్షాలో చెత్త ఉన్నా పంచాయతీ సిబ్బంది పట్టించుకున్న పాపానపోలేదు. ప్రభుత్వం సరఫరాచేసిన రిక్షాలే కదా అని వదిలేశారంటూ గ్రామస్థులు ఆరోపించారు. వర్షాలు కురుస్తుండటంతో ఎక్కడబడితే అక్కడ చెత్తపేరుకుపోయి మురుగు కాలువలు చెత్తతో నిండిపోతున్నాయి.

ధనాపురం పాఠశాల వద్ద చెత్తదిబ్బలు

పాఠశాల ఆవరణలో చెత్తదిబ్బలు నిండిపోయి దుర్వాసన తరగతుల్లోకి వెదజల్లుతోందని, శుభ్రం చేయించాలని తెలిపినా అధికారులు పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. విద్యార్థులు విషజ్వరాలబారిన పడి ఆసుపత్రి పాలవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళిత కాలనీలో డ్రైనేజీ సమస్య ఉందని పలు పత్రికల్లో కథనాలు వెలువడినా ఇప్పటి వరకు సమస్య తీరలేదు. స్వచ్ఛభారత్ సైకిళ్ల అందుబాటులో ఉంటే పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు శుభ్రం చేసేవారని స్థానికులు అంటున్నారు.

మరమ్మతుకు చర్యలు తీసుకుంటాం - రెడ్డప్ప, ఎంపీడీఓ



చెత్త సేకరించే రిక్షాలకు త్వరలో మరమ్మతులు చేయించి వాటిని వినియోగంలో తీసుకొస్తాం. స్వయంగా గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తాం.

గ్రామీణరోడ్ల అభివృద్ధికి పెద్దపీట: వసుంధరాదేవి



తమ్మినాయనిపల్లి రోడ్డుకి భూమిపూజ చేస్తున్న వసుంధరాదేవి



వెంకటాపురంలో బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

చిలమత్తూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధరదేవి అన్నారు. మండలంలోని దేమకేతేపల్లి నుంచి తమ్మినాయనిపల్లి వెళ్లే రోడ్డుని సిమెంటు రోడ్డుగా మార్చే పనులకు ఆమె శుక్రవారం భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి లింక్ రోడ్లను అభివృద్ధి చేసి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు. తమ్మినాయనిపల్లి వాసులు ఎంతో కాలంగా రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డారని, ఇంతటితో వారి సమస్య తీరుతుందన్నారు. మండల కన్వీనర్ శ్రీనివాసులు, జడ్పీటీసీ అనూష, స్థానిక నాయకులు అంజినప్ప, శ్రీనివాసరెడ్డి, నాగరాజుయాదవ్, బేకరీ గంగాధర్, బాలాజీ, లక్ష్మీనారాయణయాదవ్, రంగారెడ్డి, శ్రీదేవి, విశ్వనాథరెడ్డి, నంజుండప పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే సతీమణి పర్యటన

లేపాక్షి: ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధరదేవి శుక్రవారం మండలంలో పర్యటించారు. జవహర్‌నవోదయ పాఠశాలకు విచ్చేశారు. విద్యార్థులు, తెలుగు తమ్ముళ్లు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. హెరిటేజ్ కంపెనీ నుంచి ఎల్ఎస్ఆర్ ఫండ్స్ రూ.8లక్షలతో సోలార్ వాటర్ గీజర్స్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. బిసలమానేపల్లి నుంచి ఓబుళాపురం వరకు రూ.3కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో బీటీ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. అనంతరం మహిళలతో కలిసి మాట్లాడుతూ ఆగస్టు 15నుంచి కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తోందని, ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీని తప్పకుండా నెరవేరుస్తామన్నారు. టీడీపీ కన్వీనర్ అబి, మాజీ కన్వీనర్ జయప్ప, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.



పారిశ్రామిక వాడలో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న వసుంధరాదేవి

ప్రైవేటు పాఠశాలల తనిఖీ

రొళ్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మురళి ఇంగ్లీష్ మీడియం పాఠశాల, బాలాజీ యూపీ పాఠశాల, విశ్వ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, గొల్లహట్టి ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈఓ శ్రీధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హెచ్‌ఎం యుడైజ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే 12, 1సి అకౌంట్ ఓపెన్‌చేయాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. పాఠశాల బస్సు డ్రైవర్ మంచి ప్రవర్తనకలిగి ఉండాలని సూచించారు.

రహదారి విస్తరణ పనుల పరిశీలన

గోరంట్ల, జూలై25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్టాండ్ కూడలి నుంచి రావికుంట చెరువు కట్టవరకు చేపడుతున్న రహదారి విస్తరణ పనులను టీడీపీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. వైసీపీ పాలనలో నిలిచిపోయిన సీసీరోడ్డు పనులను టీడీపీ చేపట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంత్రి సహకారంతో సర్పంచ్ భర్త నాగేనాయక్, టీడీపీ కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి ఆధ్వర్యంలో రహదారి విస్తర్ణకోసం ఇరువైపు ఆక్రమణలు తొలగించారు. సీసీరోడ్డు పనులు వేగవంతంగా జరుగుతుండడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాయకులు ఉత్తమరెడ్డి, ఉమ్మర్‌ఖాన్, నరేష్, వేణు, శీనా, జయరాం, రవినాయక్ మల్లికార్జున, సుబ్బరాయుడు, వెంకటేష్ పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి

హిందూపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): గోళ్లాపురం పారిశ్రామికవాడలోని బ్లూ గోల్డ్ స్టీల్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో కాలు కోల్పోయిన కార్మికుడు అనూఫ్ కుటుంబాన్ని ఆదుకోవాలని కార్మిక సంఘం అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. 22న స్టీల్ పరిశ్రమలో పని చేస్తున్న సమయంలో దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగి అనూఫ్ ఎడమకాలు తెగిపోయింది. కార్మికుడు హిందూపురంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా శుక్రవారం రవికుమార్‌తోపాటు సీపీఐ నాయకులు పరామర్శించారు. చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని కోరారు. వినోద్, మారుతిరెడ్డి, సిద్దగిరి సురేష్ పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చండి

గుడిబండ, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చాలని వైసీపీ నాయకులు సూచించారు. శుక్రవారం గుడిబండలోని ప్రెస్‌క్లబ్‌లో వైసీపీ మండల కన్వీనర్ డీఎల్ ఎంజాయ్‌గౌడ్, నాయకులు తిప్పేస్వామి, బోరప్ప నాగరాజు, బోజరాజు విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ నాయకులు ప్రజలకు అపద్దపు హామీలు ఇచ్చి గెలిచి సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయకుండా నీరుగారుస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

చిట్నడుకులో సుపరిపాలనలో తొలిఅడుగు

అమరాపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చట్నడుకులో టీడీపీ మండల కన్వీనర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. సింగిల్ విండో అధ్యక్షుడు గణేష్, కన్వీనర్ శివరుద్రప్ప, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, నాగరాజు, ప్రకాశ్, శ్రీనివాస్, నవీన్, చెన్నబసప్ప, రామప్ప, హనుమంతరావు, రఘు, మంజునాథ్ పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

గోరంట్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో 31వ తేదీన నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆపార్టీ నాయకులు పిలుపునిచ్చారు. గోరంట్ల పట్టణంలోని బస్టాండ్ కూడలిలో మహాసభకు సంబంధించిన పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. రాష్ట్ర నాయకులు మహాసభలకు హాజరవుతారన్నారు. మండలంలోని కార్మికులు అధిక సంఖ్యలో తరలి రావాలన్నారు. క్రిష్టప్ప, కమాల్‌బాషా, ఆంజనేయులు, మైలారప్ప, రామాంజి, మోహన్, మనోహర్, గంగాధర్, కుమార్ పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన ప్రత్యేక అధికారి

సోమందేపల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లి వద్దనున్న కేజీబీవీని ప్రత్యేక అధికారి రాజు శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో వసతులపై ఆరాతీశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. అనంతరం వాటర్‌ప్లాంట్ గది వంటశాల, హాస్టల్ గదులు, మరుగుదొడ్లు పరిశీలించారు. వండిన ఆహారాన్ని రుచిచూసి భోజన నాణ్యతను పరిశీలించారు. సిబ్బంది నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



ఇంటర్వ్యూ చేస్తున్న దృశ్యం

పెనుకొండ, జూలై 25(ఆంధ్ర జ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఎంప్లాయిమెంట్, సీడాప్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళకు విశేష స్పందన లభించింది. శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు పది కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. మేళాకు 156మంది హాజరుకాగా అందులో 78మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్లేస్‌మెంట్ అధికారి తేజ్‌కుమార్‌రెడ్డి, కోఆర్డినేటర్ గణేష్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

అగళి, జూలై 25(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరం పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషిచేయాలని స్పెషల్ ఆఫీసర్ చంద్రశేఖర్ సూచించారు. శుక్రవారం బీసీ హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి తల్లిదండ్రులు, పాఠవాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. హాజరు పట్టికను పరిశీలించి, నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. వార్డన్ సికిందర్‌బాషా, ఏంపీఈఓ శివకుమార్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలను సద్వినియోగం చేసుకోండి

గుడిబండ, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు ఉచితంగా పంపిణీ చస్తున్న చిరుధాన్యాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, ఏఓ వీరనరేష్ కోరారు. శుక్రవారం మండలంలోని మద్దనకుంట రైతు సేవా కేంద్రంలో ఉచిత చిరుధాన్యాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. షబ్బీర్, దాసప్ప, కుమార్ పాల్గొన్నారు.

రైతుల అంగీకారంతోనే భూసేకరణ

- గ్రీన్ ఎనర్జీ ప్రతినిధి రవీంద్ర

మడకశిర రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రైతుల అంగీకారంతోనే సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు భూములు సేకరిస్తున్నాట్లు చింతా గ్రీన్ ఎనర్జీ కంపెనీ ప్రతినిధి రవీంద్ర తెలిపారు. రెవెన్యూశాఖ అధ్వర్యంలో మండలంలోని కల్లుమర్రి గ్రామంలో శుక్రవారం రైతులతో గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామ సభల ద్వారా రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్నామన్నారు. ప్రాజెక్ట్ విధివిధానాలు రైతులకు వివరించారు. రైతులకు ఎకరాకు సంవత్సరానికి రూ.30 వేలు ఇస్తామన్నారు. భూములు ఇచ్చే రైతులు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, తాజా 1బి, అడంగల్ పత్రాలను రెవెన్యూ అధికారులకు ఇవ్వాలన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధక్షుడు గుండుమల తిప్పేస్వామి కృషితో ఈ ప్రాజెక్ట్ వచ్చిందన్నారు. అనంతరం రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కొంత మంది రైతుల అంగీకార పత్రాలను కూడా అందజేశారు. మండల కన్వీనర్ నాగరాజు, ఆర్ఐ సోమశేఖర్‌రెడ్డి, మండల సర్వేయర్ హరీష్, వంశీకృష్ణ, వీఆర్వో వెంకటేశులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సోలార్ ప్రాజెక్ట్ ప్రతినిధి రవీంద్ర



మాట్లాడుతున్న కేంద్ర బృందం అధికారి దయాకర్‌రెడ్డి

కేంద్ర బృందం పరిశీలన

అమరాపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం సమీపంలో ఉన్న గ్రామైఖ్య సంఘం భవనంలో శుక్రవారం కేంద్ర అధ్యయన బృందం అధికారి దయాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం సర్పంచ్ వాగేష్ అధ్యక్షతన నిర్వహించారు. డీడబ్ల్యూఎంఏ పీడీ విజయ్ ప్రసాద్, ఏపీడీ శివానందనాయక్, ఎంపీడీఓ రామారావు, వెలుగు ఏసీ నాగరాజు, ఏపీఓ శివన్న, హౌసింగ్ ఏఈ త్రిశూల్, ఏపీఎం ముత్యాలప్ప, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు. జాతీయ ఉపాధిహామీ పథకం, పింఛన్ల పంపిణీ, మహిళా సంఘాల పనితీరును పరిశీలించారు. ప్రతినెలా ఒకటోతేదిన పింఛన్లు అందించే విధానం, ఉపాధిహామీ పథకం కింద వందరోజుల పని, మహిళా సంఘాల పనితీరు, ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, బ్యాంకు లింకేజీ తదితర కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, హనుమంతరాయ, షుకూర్, ఈరన్న, రవి, చంద్రశేఖర్, గిరీష్, ఓంకార్, మంజునాథ్, వెంకటేష్, ఎర్రగుంటప్ప పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేకే విమర్శలు: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

మడకశిర రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి చూసి ఓర్వలేకనే వైసీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప అసత్య ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ మండల క్లస్టర్ కన్వీనర్ మురళీబాబు, కో-కన్వీనర్ గంగాధర్ అన్నారు. శుక్రవారం గౌడనహళ్లి పంచాయతీ కేంద్రంలో టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. వారు మాట్లడుతూ ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామిని విమర్శించే స్థాయి వైసీపీ నాయకులకు లేదన్నారు. మండలాలు, గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని వైసీపీ నాయకలు వచ్చి పరిశీలిచాలన్నారు. అభివృద్ధి కనిపించకపోతే అప్పుడు విమర్శించాలన్నారు. కార్యక్రమంలో నరేష్‌బాబు, నరసంహమూర్తి పాల్గొన్నారు.

పుట్టపర్తి-పెనుకొండ రోడ్డుకు మార్గం సుగమం

పెనుకొండ రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్న పుట్టపర్తి-పెనుకొండ రోడ్డుకు మార్గం సుగమం అయింది. పుట్టపర్తి, కొత్తచెరువు, కొండంపల్లి రాంపురం గ్రామాల నుంచి అనునిత్యం వందల సంఖ్యలో బస్సులు, కంటైనర్లు, ద్విచక్రవాహనాలలో ఉద్యోగులు వెళ్తుండేవారు. ఈ క్రమంలో హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి కియ ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రమంత్రి నితిన్ గట్కరీని కోరగా తక్షణమే నిధులు మంజూరు చేశారు. త్వరలో రోడ్డు పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

రొద్దం, జూలై 25(ఆంధ్రజ్యోతి): చిన్నకోడిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త ఈడిగ కిష్టప్ప(50) అనారోగ్యంతో మృతిచెందగా ఆ పార్టీ నాయకులు నివాళులు అర్పించారు. శుక్రవారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. కిష్టప్ప కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆలయ జీర్ణోద్ధరణకు కమిటీ ఏర్పాటు చేయండి

పావగడ, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉత్తర పినాకిని నదివద్ద వెలసిన నాగలమడక సుబ్రహ్మణ్యేశ్వర ఆలయ జీర్ణోద్ధరణకు కమిటీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వెంకటేశ్ శుక్రవారం బెంగళూరులోని దేవదాయ శాఖ మంత్రి రామలింగారెడ్డిని కోరారు. నూతన ఆలయ నిర్మాణానికి దేవదాయ కమిషనర్, అధికారులు పరిశీలించి ఏర్పాట్లు పూర్తి చేశారని ఆలయ జీర్ణోద్ధరణకు సలహాలు తీసుకునేందుకు కమిటీలు వేస్తే అనుకూలంగా ఉంటుందన్నారు. అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

అక్రమ మద్యం అరికట్టేందుకు చర్యలు: డీసీ



ఎక్సైజ్ సిబ్బందితో మాట్లాడుతున్న డీసీ నాగమద్దయ్య

పెనుకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమ మద్యం రవాణా అరికట్టడానికి కట్టుదిట్టమైన నిఘా పెంచినట్లు ఎక్సైజ్ డిప్యూటీ సూపరింటెండెంట్ నాగమద్దయ్య అన్నారు. గురువారం పెనుకొండ ఎక్సైజ్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించి రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం ప్రవేశించకుండా గట్టి నిఘా పెట్టాలన్నారు. మద్యం వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు చేపట్టాలని, సమయపాలన పాటించాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యంసేవిస్తే కేసులు నమోదుచేయాలని సూచించారు. సీఐ సృజన్‌బాబు, ఎస్ఐలు రాజశేఖర్, రాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఏడు గొర్రెల మృతి

పరిగి, జూలై 25(ఆంధ్రజ్యోతి): పుట్టగూర్లపల్లిలో వేటకుక్కల దాడిలో ఏడు గొర్రెలు మృతిచెందిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఫారెస్ట్ అధికారి రాహుల్ తెలిపిన మేరకు కొంతకాలంగా రైతు సూర్యనారాయణ ఇంటివద్ద గొర్రెలను షెడ్డులో ఉంచి మేపుకుంటున్నాడు. కుక్కలు రాత్రి సమయంలో షెడ్డులో దూరి గొర్రెలపై ఇష్టారాజ్యాంగా దాడిచేయడంతో ఏడు గొర్రెలు మృతిచెందగా పలుగొర్రెలకు గాయాలయ్యాయి. రూ.50వేలు నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆర్థిక సాయం అందించాలని కోరారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ మైనింగ్

- రూ.కోటికి పైగా జరిమానా



మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న భూ విజ్ఞాన అధికారులు

పావగడ, జూలై 25(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని కనుంపల్లి సర్వేనంబరు 131 ప్రభుత్వ భూమిలో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కబ్జాచేసి అక్రమంగా మైనింగ్ నడుపుతున్నారన్న ఆరోపణలపై తుమకూరు జిల్లా భూవిజ్ఞాన అధికారులు శుక్రవారం పర్యటించారు. ప్రకృతి సహజంగా ఏర్పడిన కొండగుట్టలను భారీ వాహనాలతో తవ్వించి రియల్ ఎస్టేట్ కింద లేఅవుట్లుగా మారుస్తున్నారని విశ్రాంత తహసీల్దార్ నరసింహయ్య, ఆమ్‌ఆద్మీపార్టీ జిల్లా అధ్యక్షుడు జయరామయ్య, కేఆర్ఎస్ పార్టీనాయకులు గోవిందప్ప ఆరోపించారు. జిల్లా మైనింగ్ అధికారి తేజస్విణి బృందం, పావగడ తహసీల్దార్ వరదరాజు అక్కడికి చేరుకుని పరిశీలించారు. ప్రభుత్వ భూమిని చట్టానికి వ్యతిరేకంగా కబ్జాచేసి అక్రమంగా మైనింగ్ నిర్వహిస్తున్నారని అధికారులు రియల్ వ్యాపారస్థుడు తుంగకుమార్‌కు రూ.1.3 కోట్లను జరిమానా విధించినట్లు నోటీసులు జారీచేశారు.